# వర్తమానికుని సిద్ధపరచుట

దేవుని వర్తమానమును అందించడంలో శక్తివంతంగా మాటలను ఉపయోగించే (Mechanics) మెఖానిక్సును మనం పరీక్షిస్తుండగా, దేవుని వాక్యముయొక్క వర్త మానికునికి అవసరమైన గుణగణాలను గూర్చి ఆలోచించడం బహు యుక్తంగా ఉంటుంది. సందేశాన్ని అందించే పనిముట్లను ఉపయోగించడమనేది వాటిని ఉపయోగించే వానిమీద ఆధారపడి యుంటుంది. కట్టెను నరకుటలో బలంగా గొడ్డలి వినియోగింపబడవచ్చు, లేదా మనిషిని చంపడానికి కూడా దాన్ని ఉపయోగింపవచ్చు. గొడ్డలి ఉపయోగించే వాని హృదయం మీద అది ఆధారపడియుంటుంది. గనుక బలమైన ఒక వర్తమానాన్ని సిద్ధపరచుకొనకముందు, వర్తమానికుడు తన్ను తాను సిద్ధపడియుండాలి. వర్తమానాన్ని సిద్ధపరచుకొని దాన్ని అందించే విధానాన్ని నేర్చుకొనకముందు, కొంచెం సేపు మన అంతరంగంవైపు తిరిగి మనలను మనమే పరీశీలించు కొనవలసియుంది. వర్తమానికుడు వర్తమానానికి తగినవాడుగా ఉండాలి. సువార్త యొక్క బలమైన వర్తమానికులముగా మనము కాకముందు మనలను మనమే కొన్ని ప్రాముఖ్యమైన ప్రశ్నలను అడుగుకొనవలసియుంది.

## మనలను నడిపించునవి ఏవి?

తప్పుడు కారాణాల నిమిత్తము దేవుని వాక్యాన్ని ప్రకటించేవారు ఎల్లప్పుడూ ఉన్నారు. కొందరు కక్షచేతను మిషచేతను ప్రకటించినవారున్నారు (ఫిలిప్పీ. 1:15). కొందరు డబ్బుకొరకు ప్రకటించవచ్చు (1 తిమోతి 3:3; 6:10; తీతు 1:11; 1 పేతురు 5:2). తమ సొంత ప్రాధాన్యతను పెంచుకొనాలనే భావంతో కూడా ప్రకటింపవచ్చు; మాట్లాడగల తమ సామర్థ్యాన్ని ప్రదర్శించుకొంటూ తమ కొరకు వారు మహిమను ఘనతను కోరుతూ ఉంటారు. మరికొందరు జనులయొక్క జీవితాలపై ఆధిపత్యం వహించగోరి; తమ చెప్పు చేతులలో వారిని నడిపించడానికి గాను గలిబిలి చేస్తారు. మరికొందరైతే, తమ భావాలను (ఉద్దేశాలను) యితరులపై రుద్దడానికి ప్రసంగిచడం లేక ఉపదేశించడం మార్గమైయున్నట్టు చూస్తారు.

నశించిన మనుష్యులను దేవునితో ఐక్యపరచడం అనే దానికొరకు కాక మరి ఏ కారణాన్ని బట్టి మనం సువార్త ప్రకటించదలచుకొన్నా, మనం ప్రకటించకుండ ఉండడం మేలు కావచ్చు. నశించినవారి పట్ల మనకున్న కనికరమును బట్టి సువార్త ప్రకటించాలనే తలంపు కలగాలి. క్రీస్తు లేనివారు నశించారని, నిరీక్షణలేక యున్నారని మనం ఒప్పింపబడాలి (ఎఫెసీ. 2:12;

ప్రకటన 20:15). క్రీస్తు యేసు ఈ లోకానికి రావడంలో (అవతరించడంలోని) ఉద్దేశం "నశించిన దానిని వెదకి రక్షించుటకే" (లూకా 19:10). ప్రభువైన యేసు యొక్క సువార్తను మనం ప్రకటించనట్లయితే, నశించిన అనేక ఆత్మలు రక్షింపబడనేరవని మనము ఒప్పింప బడాలి. మన పని ఆపదలో ఉన్నవారిని తప్పించు పనియైయుండాలి. లేకుంటే, మన సువార్త ప్రకటనలో ఎంత నైపుణ్యంగా మాటలు ఉపయోగించడానికి మనం సిద్ధపడినా, మన ప్రకటన హృదయ పూర్వకంకానిదై యుంటుంది. సహృదయంలేని సువార్తికుడు ఉండడంకంటే, అసలు సువార్తికుడు లేకుంటేనే మేలు. తప్పుడు ఉద్దేశాలుగల సువార్తికునిలో శక్తివంతంగా ఉండడానికి అవసరమైన తత్వం, మంట, సమర్పణ లోపించియుంటాయి.

## మన స్వభావం సంగతి ఏమి?

ఒక ఆత్మను దేవుని యొద్దకు నడిపించుట లేదా ఒక ఆత్మను దేవుని యొద్దనుండి తోలివేయుట అనేది మన స్వభావం మీద (తత్వంమీద) ఆధారపడియుంటుంది. దేవునికి విరోధంగా తిరుగుబాటు చేయు ఆత్మయొక్క గమ్యం నరకమని ప్రసంగించిన ఒక ప్రసంగాన్ని నేను విన్నాను. నేను నరకానికి వెళ్లినా అతనికి లక్ష్యం లేనట్టు అతడు వినిపించాడు గనుక అతడు కఠినంగాను నీచంగాను ఉన్నట్టు నేను తలంచాను. తాను అధికుడైయున్నట్టు అతని స్వభావము, గొప్ప భక్తుడైయున్నట్టు తత్వం వలన పరలోకానికి వెళ్లే ఏ నిరీక్షణా నాకు లేనట్టును నరకమే నాకు తగినదైయున్నట్టును అతడు వినిపించాడు. మిలిటరీ కమాండరులా భయపెట్టే అరుపులు అరిసాడు. అప్పటికి నేను క్రైస్తవుడనై యుండకున్నట్లయితే, దేవునినుండి నన్ను దూరంగా తరిమియుండి యుండవచ్చు. కొంతకాలం తరువాత "నరకం ఎలా ఉంటుంది?" అనే దాని మీద మరొక ప్రసంగీకుని ప్రసంగం విన్నాను. అతడు కూడా అదే సత్యాలను ప్రసంగించాడు, గాని అతడు కనికరంగల స్వభావంతో ప్రసంగించాడు. అక్కడికి నేను వెళ్లడం అతనికి యిష్టంలేనట్టు నిస్సందేహంగా నేను ఎరుగుదును. ఎందుకంటే, అతడు నా ఆత్మను ప్రేమించి నేను పరలోకానికి వెళ్లాలని అతడు కోరాడు. కనికరం కలిగి హెచ్చరించిన ప్రభువైన యేసు యొక్క తత్వాన్ని నేను అతనియందు కనుగొన్నాను (మత్తయి 23:37, 38). అలాటప్పుడు మనం కలిగియుండవలసిన కొన్ని స్వభావ లక్షణములేవి?

మొదటిది, కృతజ్ఞతగల స్వభావం మనం కలిగియుండాలి. ఒక మనిషి వీధిలో గుండా నడిచిపోతూ ఒక త్రాగుబోతు తన వాంతిలో పొర్లుతూ ఉండడం చూచి, "దేవుని కృపను బట్టి కాకుంటే, నేను అక్కడ ఉండేవాడినే" అన్నవానివలే మన స్వభావ తత్వముండాలి. పాపులను సంధించడానికి వేళ్లే మనం కూడా పాపం చేసినవారమే. మనం దేవుని కృపను పొందియున్నవారమైనందున, యితరులు కూడా అలాగే కృపను పొందాలని మనం వాంఛిస్తున్నాం. ప్రభువైన యేసుయొక్క సువార్తను అంగీకరించకముందు మనం ఎలాటి వారమో, మనం కలిసికొనడానికి వెళ్లే ప్రతి వ్యక్తికూడా అట్టివాడే. దేవుని వర్తమానాన్ని అందించడానికిగాను పవిత్రమైన మార్గాలుగా కృతజ్ఞతకలిగి యుండడానికే మనం కోర్కె కలిగియుండాలి. మన క్షమాపణగాని, దేవునిచే మనం అంగీకరింపబడడం గాని కేవలం ప్రభువైన యేసు యొక్క సిలువవలన మాత్రమే సాధ్యం చేయబడుతుంది. ఆయన సిలువపై

చేసిన యాగమునకు కలిగియుండవలసిన కృతజ్ఞతను బట్టి సిలువ చాటున దాగి, ప్రభువైన యేసు వారికొరకు ఏమి చేశారో యితరులకు చూపడానికి సహాయం చేయాలి. క్రొత్త నిబంధన ప్రకటనకు సిలువయే కేంద్ర స్థానమైయున్నది (అపొ. 2:22, 23; 1 కొరింథీ. 2:2).

రెండవది, సేవకుని యొక్క స్వభావ లక్షణము మనం కలిగియుండాలి. ఫిలిప్పీ. 2:5–8లో పౌలు యిలా అన్నాడు: "క్రీస్తు యేసునకు కలిగిన ఈ మనస్సు మీరును కలిగియుండుడి." ప్రభువైన యేసు కలిగియున్న స్వభావ మెట్టిది? తరువాత కొన్ని వచనాలలో, ప్రభువైన యేసు యొక్క స్వభావం తేటగా వివరించబడింది.

(1) ఆయన దేవుని స్వరూపము కలిగినవాడై యుండియు, భూమి మీదికి అవతరించ డానికి యేసు దేవుని పాత్రను వదలి వచ్చాడు. దేవుని అద్వితీయ కుమారుడుగా, దేవునితో సమానుడుగా, పరలోకంలో అత్యున్నతమైన అంతస్థును అధికారాన్ని ఆయన పంచుకున్నాడు. అయినా నశించిన దేవుని సృష్టిని విమోచించుటకుగాను ఆయన ఆ అంతస్థును వదులుకొనడానికి యిష్టపడ్డాడు.

(2) ఆయన యజమానుడై యుండియు, తాను వారికి బానిసగా ఉండుటకు తన్ను తానే యిష్టపూర్వకంగా అప్పగించుకున్నాడు.

(3) ఆయన దేవుడై యుండియు, మానవ శరీరాకారంలో రావడానికి యిష్టపడ్డాడు.

(4) ఇతరులు తనకు లోబడే హక్కుగలవాడైయున్నా, మరణము పొందునంతగా అనగా క్రూరమైన సిలువ మరణము పొందునంతగా తన్ను తాను విధేయుడుగా చేసికొన్నాడు.

ప్రభువైన యేసు యొక్క స్వభావం అలాటిది! దేవుని వాక్యానికి మనము ఫలభరితమైన సువార్తికులము, ఉపదేశకులమైయున్నయెడల, ఈలాటి స్వభావ లక్షణాలనే మనము పెంపొందింప జేసికోవాలి. ఇతరులు మనలను సేవించేలా డిమాండ్ చేయడానికి మనము సువార్త ప్రకటించము. ఇతరులకు, సేవ చేయడానికి మనం ప్రకటిస్తాం. మనకు వ్యక్తిగతంగా ఎంత నష్టం కలిగినా, నశించుతున్న వారిని ఆ స్థితిలోనుండి తప్పించడానికి సువార్త ప్రకటించుతాం. దేవుని యొద్దకు జనులను ఆకర్షిస్తాం, మనయొద్దకు కాదు. మన జీవితాలకొరకైన దేవుని ఉద్దేశాలను నెరవేర్చడానికి వెదుకుదాం; తన పనిని చేయునట్లు దేవుడు మనలను ఉపయోగించుకొనేలా ఆ బలాధిక్యము మన మూలమయ్యింది గాక దేవునిదే అయ్యున్నట్టు మనం ఏదో ఒకవిధంగా ఎరుకచేయాలి (1 కొరింథీ. 2:5; 2 కొరింథీ. 4:7).

మూడవది, మనకు ధైర్యముగల స్వభావముండాలి. అది అపొస్తలులకంటే ఎక్కువ ఫలభరితంగా ప్రభువైన యేసును కొద్దిమందికి కూడా ప్రకటించియుండక పోవచ్చు. పేతురు యోహానులను బంధించి రాత్రియంతా చెరసాలలో ఎందుకు ఉంచారో అపొ. 4లోని కథ తెలియజేస్తుంది. ప్రభువైన యేసు యొక్క పునరుత్థానాన్ని గూర్చి వారు ఏ అధికారంతో ప్రకటించారో విచారింపబడడానికి మరుదినమున వారు అధికారులయొద్దకు తేబడ్డారు. ఆ ముందటి దినాన కుంటివానిని బాగుచేసిన నజరేయుడగు యేసు నామముననే పేతురు వారికి సమాధానమిచ్చాడు. కొన్ని వారాలకు ముందు ఆ అధికారులు ఆయనను సిలువ వేసిన సంగతిని అతడు వారికి జ్ఞాపకం చేశాడు. ఆకాశము క్రింద మనుష్యులలో యివ్వబడిన మరి ఏ నామమునను రక్షణలేదని అతడింకా వారికి ప్రకటించాడు. పేతురు యోహానులు విద్యలేని సామాన్య జనులని అధికారులకు తెలుసు (అపొ. 4:13), అయితే వారు ప్రభువైన

యేసుతో కూడా ఉన్నవారని వారు నిస్సందేహంగా ఎరుగుదురు.

వారిని శిక్షించడానికి అధికారులు భయపడ్డారు. ఎందుకంటే, కుంటివానిని వారు బాగుచేసినట్టు చూచిన జనులందరు దేవుని మహిమపరచారు. గనుక వారిని భయపెట్టి పంపివేశారు. ఏమి జరిగిందో పేతురు యోహాను వెళ్లి యితర క్రైస్తవులకు తెలియ జేసినప్పుడు, వారందరు ఏకముగా ప్రార్థనయందు తమ స్వరాలను ఎత్తారు. 29వ వచనంలో, బెదిరింపబడినా సరే, ధైర్యముగా దేవుని వాక్యము ప్రకటించేలా వారు ప్రార్థించారు.

ఎఫెసీయులకు తన పత్రికను ముగించే విన్నపంలో, సువార్త మర్మమును ధైర్యముగా తెలియజేయుటకు అతడు నోరు తెరచునప్పుడు, దానిని గూర్చి తాను మాటలాడ వలసినట్టుగా ధైర్యముతో మాటలాడుటకై వాక్శక్తి తనకు అనుగ్రహింపబడునట్లు తన నిమిత్తము పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయుమని పౌలు వారిని కోరాడు (ఎఫెసీ. 6:19, 20). ధైర్యం! బెదురులేకుండుట! తాను అధికుడనే తత్వం పౌలుకులేదు. అతడు హెచ్చువాటియందు మనస్సునుంచినవాడు కాడు. కేవలం వినయంతో కూడిన ధైర్యంతో మన సువార్త ప్రకటన ఉపదేశములు జరుగుతూ ఉండాలి.

నాల్గవది, యథార్థతగల స్వభావం మనం కలిగియుండాలి. "దేవుడనుగ్రహించు పరిశుద్ధతతోను నిష్కాపట్యముతోను" తాను నడుచుకొనినట్టు పౌలు కొరింథీయులకు స్థిరంగా తెలిపాడు (2 కొరింథీ. 1:12). ప్రేమ నిష్కపటమైనదిగా ఉండాలని కూడా అతడు ఉపదేశించాడు (రోమా 12:9). "నిష్కపటము" మాటకు "కపటము లేకుండ" (without wax, మైనములేకుండుట) అని అర్థం. పవిత్రతకు సంబంధించి కొన్ని సార్లు యిది ఉపయోగించబడుతుంది, తేనెతుట్టుకు సంబంధించినది లేకుండ తేనెను తీయడంలా! అంటే అది యథార్థమయింది, అందులో యింకా ఏమీ కలపడం లేదనే భావంతో చేతి పనులలో నిపుణులైనవారు ప్రశస్తమైన లోహాలతో దేవతలనబడే విగ్రహాలను చేస్తారు. దానిలో ఏ లోపంలేనప్పుడే, ఆ బొమ్మ అడుగుభాగాన చేసినవాడు తన ముద్ర వేసికొంటాడు. లోపమున్నవాటిని రిపేరు చేసే పనివారు మైనం వగైరాలాంటి వాటిని రుద్ది నున్నగా తీర్చి దిద్దుతారు. అయితే వీటిని తక్కువ వెలకు అమ్ముతారు. అంతేగాక దాని అడుగు భాగంలో చేసినవాడి ముద్ర ఉండదు. అలా మైనం లేనివి మాత్రమే నిఖాళస్సయినవి లేక యథార్థమైనవి. ఎవని జీవితము ఉద్దేశాలు పవిత్రమైనవో నిష్కళంకమైనవో అతడే యథార్థవంతుడైన సువార్తికుడు. మనం దేవునికి నమ్మకంగా ఉండాలి మరియు ఆయన వాక్యం పట్ల సత్యంగా ఉండాలి. వ్యక్తిగతమైన లాభాలను వెదకే మోసగాండ్రతో లోకం నింపబడింది. వ్యక్తిగతమైన లాభంకొరకు దైవ జనుడుగా కన్పించే సువార్తికుడు అందరిని మించిన గొప్ప మోసగాడు.

## మన జీవితాలను గూర్చి ఏమిటి?

మొదటిగా, మనం ప్రకటించే దాన్ని మనం జీవించాలి. నేను స్కూలులో ఉన్నప్పుడు బైబిలు ఉపాధ్యాయుడు ఏమి నేర్పించారంటే, యితరులకు మనమేదైనా చేయవలెనని అడిగేటప్పుడు దాన్ని మనం పదిసార్లు చేసియుండాలట. John R. Stott యిలా అన్నాడు, "మొదట మనకు మనం బోధించకుండ యితరులకు మనమేమీ బోధించలేము."[1] "... ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే భ్రష్టుడనై పోదునేమో అని నా శరీరమును నలుగగొట్టి,

దానిని లోబరచుకొనుచున్నాను" అని పౌలన్నాడు (1 కొరింథీ. 9:27). మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను మనము విశ్వాసులకు మాదిరిగా ఉండాలి (1 తిమోతి 4:12). మనం మాట్లాడేదానితో మనం చేసేది ఏకీభవించక పోయినట్టయితే, మనం చెప్పేది జనులు వినకపోయే ఆస్కారముంది. పవిత్రమైన పరిశుద్ధమైన జీవితం మన పనిలో దేవుని శక్తికి సాక్షిగా మన ప్రపంచంలో నిలిచి యుంటుంది. లోకం దేవుని గూర్చి విననవసరం కలిగియుండడమే గాక, మానవ జీవితాల్లో దేవుని పనిని అది చూడవలసియుంటుంది. మనము దేవుని వాక్యము యొక్క వర్తమానికులమై ఉండాలంటే, వర్తమానికుని మీద సందేహం కలిగించే జీవితాలను జీవించకూడదు.

రెండవది, మనకు అప్పగింపబడిన దాని విషయంలో మనం నమ్మకంగా ఉండాలి. దేవునిచే నమ్మకం పెట్టబడిన వారు నమ్మకమైన వారుగా ఉండనెదురు చూడబడతారు (1 కొరింథీ. 4:2). మరలా, John R. Stott యిలా అన్నాడు:

> క్రైస్తవ మతము యొక్క ప్రాథమిక విశ్వాసమేమంటే – మనం ఏది నమ్ముతున్నామో అది నమ్ముతున్నది, మనుష్యులు కనిపెట్టినందున కాదు, కాని దేవుడే దానిని బయలు పరచినందున.... ఈ అభయాన్ని పంచుకొనే ప్రసంగీకులు దైవీకమైన బయల్పాటుకు ప్రకటనకు ట్రస్టీస్ అన్నట్టు తమ్మును తామే చూచుకుంటారు, లేదా పౌలు వ్యక్త పరచినట్టు, వారు "దేవుని మర్మముల విషయములో గృహనిర్వాహకులై యుంటారు" (1 కొరింథీ. 4:1), అంటే, ఆయన బయలు పరచిన రహస్యములకు.[2]

మూడవది, మన జీవితాలే యితరులకు సజీవమైన రికమండేషన్ అయ్యుండాలి, దీన్ని మనం గుర్తించినా లేకపోయినా, మన జీవితాలు యితరులకు రికమండేషన్లే. అది తప్పుగాని రైటుగాని, మనం నడిచే దారిలో కొందరు మనలను అనుసరిస్తారు. ఒకరోజు ఒకడు సమాధుల దొడ్డి గుండా నడుస్తూ సమాధులమీద వ్రాయబడిన మాటలను చదువుతూ పోతున్నాడు. అందులో ఒకటి అతని దృష్టిని ప్రత్యేకంగా ఆకర్షించింది. అది యిలా అంది,

> నీవు దాటి వెళ్లేటప్పుడు స్నేహితుడా జ్ఞాపకముంచుకో నీవు నేడెలా ఉన్నావో ఒకప్పుడు నేనుకూడా అలాగే ఉన్నాను. నేనిప్పుడెలా ఉన్నానో, త్వరలో నీవుకూడా అలాగే ఉంటావు. గనుక నన్ను వెంబడించడానికి, నా స్నేహితుడా, సిద్ధపడు.

ఈ వచనాన్ని గూర్చి కొంచెం సేపు ఆలోచించిన తరువాత, అతడొక సుద్ద ముక్కను తీసికొని దాని క్రింద యిలా వ్రాశాడు,

> నిన్ను వెంబడించడానికి నాకు తృప్తి లేదు. నీవే మార్గానవెళ్లావో నేను ఎరిగే పర్యంతం.

మనం ఎక్కడికి వెళ్లినా, ఈ జీవితంలోగాని లేదా ఆ తరువాతగాని, మనతో కూడా యితరులను తీసికొని వెళ్లతాం. అది మితానుభవంతో కూడిన యోచనయైయుంది.

---

సూచన

[1]John R. Stott, *Between Two Worlds* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1932), 58. [2]Ibid., 57.

# వర్తమానికుడా,

# నీ వర్తమానాన్ని ఎరుగు!

చిత్రీకరింపబడిన భాషలో, దేవుని వర్తమానానికి సువార్తికుడు పవిత్రమైన బాటయై యున్నట్టు పౌలు తిమోతిపైన పెట్టాడు. సువార్తికుని యొక్క పాత్రను ఘనతకొరకై వినియోగింపబడెడు పాత్రకు అతడు పోల్చాడు. సువార్తికుడు తన్ను తాను పవిత్ర పరచుకొన్నట్టయితే, ప్రతి సత్కార్యమునకు తగినవాడై దేవునిచే ఉపయోగింపబడే పాత్రయైయుంటాడని అతడు తెలియజేశాడు (2 తిమోతి 2:20, 21). వర్తమానం యొక్క మూలంగాని, దాని సొంతంగాని ఎరుగని ఎవడును సువార్త సందేశానికి పవిత్రమైన వర్తమానికుడైయుండడు. మూలంలేకుంటే, వర్తమానం వక్రంగా మారిపోతుంది. ఇది నిజం ఎందుకంటే, మూలమే వర్తమానం. దేవుని, ఆయన ఉద్దేశాలను అపార్థం చేసికొనడమే తరచుగా ఆ వర్తమానాన్ని అపార్థం చేసికొనడం ఔతుంది. ఆయన వర్తమానాన్ని అర్థం చేసికొనడానికిగాను వర్తమానికుడు దేవుని ఎరిగినవాడై యుండాలి.

పెద్ద, తేటైన సెల ఏటి నీటివద్దకు నీవు వచ్చావని ఊహించు. స్వచ్ఛమైన తేటైన ఈ నీరు ఎక్కడనుండి వస్తుందని నీవు ఆశ్చర్యపడ్డావు. ఆ సెలఏరు వెంట కొండచరయనున్న దాని మూలం – ఒక పెద్ద ఊట యొద్దకు నీవు వెళ్లావు. ఊట నీటివలన కడుగబడిన పెద్ద, నున్నని రాయి ఆ నీటి ఊటయొక్క ద్వారాన్ని చుట్టూ ఆవరించియుంది. నీవు ఆ ఊటలోనికి ఎంతవరకు చూడగలవో, అది ఘనీభవించిన బండ, అదొక తేటైన రిజర్వాయర్. తిరిగి నీవు ఆ కొండను దిగి వచ్చేటప్పుడు, దాని మూలంనుండి దూరమయ్యే కొలది నీటియొక్క పవిత్రత క్రమంగా తగ్గుకొంటూ వస్తుంది. ఆ సెలఏరు గ్రామం ప్రక్కగా ప్రవహించి వచ్చేసరికి, నేలలోనుండి మురికి, కలిషితంతో కలుస్తుంది. దిగువ భాగమున ఉన్న పెద్ద ప్రవాహం దగ్గరకు వస్తున్నప్పుడు, అది మురుకులై పోతుంది. ఈ స్థలంలో, సెలఏటి ప్రవాహానికి కాలువగా పనిచేస్తున్న దీనికిని, సెలఏటి నీటివద్ద కాలవగా పనిచేసిన దానికిని సంబంధమున్నట్టులేదు. సెలఏటి నీటివద్ద ప్రవాహము ఊట వంటి పదార్థాన్నే కలిగియుంది. ఊటయొద్దనుండి దూరం వెళ్లేకొద్ది, ప్రవాహం యొక్క నడక మరొక స్వభావాన్ని ధరించింది.

అదే విధంగా, దేవుని వాక్యం యొక్క వర్తమానికుడు దాని మూలానికి – అంటే, దేవుని

యొద్దకు – దేవునికి ఎంత సమీపంగా వస్తాడో, అంతగా అతడు దేవునిలా మారతాడు, ఆ విధంగా, ఆయన వర్తమానాన్ని కొనిపోవడానికి మార్గమై (కాలువయై) యుంటాడు. సువార్తికుడు లేక దేవుని వాక్యము యొక్క ఉపదేశకుడు కేవలం దేవునిచే ఉపయోగించుకొనబడే ఒక మార్గం, ఒక సాధనం మాత్రమే. గుర్తింపు లేనట్టుగానే ఆ మార్గం (కాలువ) నిలిచిపోవాలి, కాని, వర్తమానం మాత్రం వినబడాలి. వర్తమానం యొక్క మూలానికి మనం ఎంత దగ్గరకు వెళ్తామో, ఆ వర్తమానాన్ని హెచ్చించాలని అంత ఎక్కువగా కోరతాము, దానితో మనలను హెచ్చించుకోవాలనే కోర్కె తగ్గిపోతుంది.

ఆ మూలానికి ఎంత దగ్గరగా వెళ్లగలమో అంతదగ్గరకు వెళ్లి, అక్కడే మనం నిలిచి యుండడం ఎలా? మొదటిగా, బైబిలు పఠనంవలన మన వర్తమానం యొక్క మూలానికి వెళ్లగలం. బైబిలు సందేశాన్ని అందించడంలో మనం ఫలభరితంగా ఉండాలంటే, బైబిలును మానవులకొరకు దేవుడు బయలుపరచిన గ్రంథంగా మనం అంగీకరించి తీరాలి. దేవుని యొద్ద నుండి పలుకబడిన లేదా దాఖలు చేయబడిన ఏకైకమైనది బైబిలు మాత్రమే అంగీకరించాలి. దేవుడు ప్రకృతి ద్వారా, ఒక మంచి జీవితం ద్వారా, లేదా దృశ్యమైన మార్గాల్లో తన్ను బయలు పరచుకొనవచ్చునుగాని, దాఖలు చేయబడిన దేవుని వాక్యము బైబిలు మాత్రమే (1 కొరింథీ. 2:9, 10; 2 తిమోతి 3:16, 17; 2 పేతురు 1:20, 21). దేవుని వర్తమానాన్ని పొందడానికి అడ్డదారులులేవు. అద్భుతమైన ప్రవచన వాక్యంద్వారా నేడు మనము దానిని పొందే మార్గంలేదు. గంటల తరబడి బైబిలును చదవడం, తిరిగి చదవడంవలననే మనం దానిని పొందగలం.

మనం బైబిలును మనతో మాట్లాడనివ్వాలి. మనం బైబిలును చదవడం మాత్రమే కాదు, బైబిలు మనలను కూడా చదువనివ్వాలి. అది మనతో మాట్లాడకుండ, వాక్యం యింకా ఎవరితోనూ మనం మాట్లాడ చేయలేం: “కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును” (రోమా 10:17). ఏదో ఒక కరపత్రికను పట్టుకొని, లేదా పేపర్‌లో ఒక వ్యాసాన్ని ఎత్తుకొని, దాన్ని చదివి, ప్రసంగించడం తేలికయే, కాని ఆ వర్తమానం తప్పుగాని రైటుగాని అయ్యుండవచ్చు. దాన్ని ఎవరైనా వ్రాసియుండ వచ్చు. ఆ పత్రికను, లేదా ఆ వ్యాసాన్ని దేవుని వాక్యం యొక్క వెలుగులో పరిశీలించని యెడల, మనం చేసే ప్రసంగం మనలనుగాని మనశ్రోతలనుగాని మూలం దగ్గరకు కొనిపోదు. మంచి కరపత్రికలు పేపర్లలోని వ్యాసాలు ప్రయోజనకరమైనవే. బైబిలును గూర్చి వ్రాయబడిన పుస్తకాలను చదవడంలో బైబిలును చదివే సమయం లేకుండా మనం గడపవచ్చు. తగినంత సిద్ధపాటుతో ప్రజలయొక్క శ్రద్ధను పొందదగిన హక్కును సంపాదించుకొనకుండ, వారి శ్రద్ధను పొందడానికి మనకు హక్కు ఎక్కడిది? మన సమాచారం దేవుని వాక్యానుసారమైయున్నట్టు (అనుగుణ్యమైనదైయున్నట్టు) జాగ్రత్తగా చూచుకోవాలి. మన ఉపదేశానికి మనం బాధ్యులం (యాకోబు 3:1). చెప్పడానికి సమాచారం కలిగియుండడానికిని, ఏదో ఒకటి చెప్పనవసరం ఉండడానికిని చాలా వ్యత్యాసముంది.

మనం మన వర్తమానంగా మారాలి. లేనట్టయితే, మన ప్రసంగం గాలిలోనికి విడచి పెట్టిన మాటలుగా మాత్రమే అయ్యుంటుంది. మన వర్తమానం యితరులను ప్రోత్సహించ వలెనంటే, అది మొదటిగా మనలను ప్రోత్సహించినదైయుండాలి. మన వర్తమానం తప్పును

రుజువు చేయునదైతే, మనం అదే తప్పులో ఉన్నప్పుడు, తప్పుగా మనలను రుజువు చేసినదైయుండాలి. మన వర్తమానం గద్దించునదైయుంటే, మనం అదే స్థితిలో ఉన్నప్పుడు మనలను గద్దించినదైయుండాలి. మన శ్రోతలు ప్రార్థనయొక్క అవసరతతో ఉన్నట్టు తెలిసికోవాలని మనం కోరితే, మన ప్రార్థన యొక్క అవసరత ముందుగా తీర్చబడి యుండాలి లేదా, మనం ప్రార్థనయొక్క అవసరతలో నిలిచియుండాలి. ఇతరుల హృదయాలు తాకబడక ముందు మన హృదయాలు తాకబడాలి. వర్తమానాన్ని మనం యితరుల యొద్దకు కొనిపోకముందు అది మన యొద్దకు వచ్చియుండాలి.

రెండవది, ప్రార్థన ద్వారా మన వర్తమానం యొక్క మూలానికి మనం సమీపించగలం. మన యొద్దనుండి ఆయన యొద్దకు వెళ్లే సమాచారము లైన్లను తెరచియుంచి, ప్రార్థించే భాగ్యాన్ని ఆయన మనకు ప్రసాదించాడు. "ప్రార్థన సంగతులను మార్చుతుంది" అనే పద ప్రయోగాన్ని బహుశా నీవు వినియుండవచ్చు. అది నిజమైయుండగా, జనులవలే విషయాలు మారడం అంత ప్రాముఖ్యం కాదు. అంతగా ప్రార్థన, మార్చేది ప్రార్థించేవానినే.

ప్రార్థన అంటే దేవునితో మాట్లాడడం. ప్రార్థన ద్వారా, మన విన్నపాలను దేవునికి తెలియజేసికొంటాం (ఫిలిప్పీ. 4:6). "దేవునితో సహవాసం కలిగియుండడం" అని మేలుగా వ్యక్తపరచబడింది. వారి యొద్దనుండి మనకేదైనా కావాలన్నప్పుడు మాత్రమే మనము భూసంబంధులైన తండ్రులతో మాట్లాడుతాం ప్రార్థన అనేది పరలోకపు తండ్రిని దర్శించడమై యుంది, ఆయనతో సంభాషించడం. ప్రార్థించడానికి ప్రభువైన యేసు కొండకు వెళ్లినప్పుడు, అది ఆయన తన తండ్రిని దర్శించుటను పోలియుంది. ఆయన యింటికి తిరిగి వెళ్లాలని ఎంత ఆశకలిగియున్నాడో!

కావచ్చు, ఆయన వాక్యాన్ని ప్రకటించడానికి మనలను మనం సిద్ధపరచుకొంటూ ఉండగా, మన అవసరతలను తీర్చగల జ్ఞానము, శక్తి మన పరలోకపు తండ్రికి ఉందనే గుర్తింపుతో మనం ప్రార్థన చేస్తాం. ఆయన చిత్తాన్ని జరిగించడానికి మనకు సామర్థ్యం కలిగించుమని మనం ఆయనకు విన్నవించుకొనడానికి పైన, ఆయన ప్రసన్నతలో ఉన్నందుకే కావలసిన శక్తి మనకు అవసరమైయుంది. ప్రార్థన మనలను దేవుని సానిధ్యానికి కొనిపోతుంది.

## ముగింపు

మన వర్తమానాన్ని తెలిసికొనడమంటే, యోగ్యమైన వర్తమానాలన్నీ ఎవరి యొద్దనుండి వస్తాయో ఆయన్ను ఎరుగుటయే. వర్తమానాన్ని ప్రసాదించే ప్రధాత లేకుండ వర్తమానం ఏమిలేనిదే, ఆత్మలేని, సరియైన అధికారము లేనిదైయుంటుంది. బైబిలు వర్త మానాలన్నింటికి అధికారం దేవుడేయని జ్ఞాపకం ఉంచుకొనడం ప్రాముఖ్యం. మనయందు లేదా మనదై ఏ అధికారమూ లేదు. తన వర్తమానానికి దేవుడు ప్రసాదించే అధికారం నుండే మన వర్తమానం (పారాలి) ప్రవహించాలి. వర్తమానం ఆయనదే. మనము ఆ వర్తమానాన్ని ప్రవహింపజేసే కాలువలవంటివారమే. మూలానికి మనం సమీపంగా ఉన్నట్టయితే, మన వర్తమానం నిష్కపటమైన రింగ్ కలిగి, ఆయన అధికారము యొక్క శక్తి చేత బలపరచబడుతుంది.

# ప్రసంగాన్ని సిద్ధపరచుకొనడంలో: తలంపును తెచ్చుకొనడం

వర్తమానాన్ని సిద్ధపరచుకొనే వ్యక్తిని సిద్ధపరచడానికి గాను యోచింపదగినంత దృష్టిని నిలిపాం, ఇప్పుడు వర్తమానాన్ని సిద్ధపరచడానికి అవసరమైన కొన్నింటిని మనం పరిశీలించబోతాం. చిన్న ప్లానును నీవు అనుసరించినట్లయితే, దేవుని హృదయాన్ని ఆయన మనస్సును ఫలభరితంగా అందించే బైబిలు వర్తమానాలను సిద్ధపరచడం సులభసాధ్యమౌతుంది. వర్తమానాన్ని పెంపొందించడం యింటిని కట్టుటను పోలియుంటుంది. స్థలం చూచుకోవాలి దాన్ని సిద్ధం చేసికోవాలి. ఇల్లు యొక్క ఆకారం రూపుదిద్దకముందు పునాదివేయాలి. గోడలు కట్టేవరకు తలుపులు కిటికీలు వాటి స్థానంలో అమర్చడానికి వీలుండదు. చుట్టు గోడలు లేపేవరకు కప్పువేయనొల్లపడదు. ఒక దాని వెంట ఒకటి క్రమబద్ధంగా యిల్లు ఎలా కట్టబడుతుందో, అలాగే వర్తమానాన్ని ఒకదాని తరువాత ఒకటి నిర్మించాలి.

ఈ ప్లానులో మొదటి అంచ, వర్తమానానికి సంబంధించిన తలంపును (ఉద్దేశాన్ని) తెచ్చుకొనడం. కొన్నిసార్లు, వాటిని పెంపొందింపగలదానికంటే త్వరితంగా తలంపులు వస్తూ ఉంటాయి. మిగతా సమయాల్లో, ప్రత్యేకించి నీవు ఎక్కువసేపు సిద్ధపడిన తరువాత, లేక ఎక్కువ సమయం ఆలోచించిన తరువాత, మరు ప్రసంగం కొరకు తలంపు రావడమనేది మిక్కుటమైన అక్కరగా నిలిచియుంటుంది. ప్రతివారం ఒకటి, లేక అంతకంటే ఎక్కువ పాఠాలు నీవు సిద్ధపరచవలసి యున్నట్టయితే, చాలాకాలం వరకు వాటిని వల్లించకుండునట్లు, అనేక అంశాలను చుట్టివచ్చే విశాలమైన ఒక ప్లానును నీవు అమలు పెట్టుకొనేలా చూచుకోవాలి. వారం వెంట వారం నీకు నచ్చిన ఒక అంశాన్ని లేదా ఒక బైబిలు పాఠ్యభాగాన్ని ప్రసంగించుతూ, నీ శ్రోతలు నేర్చుకోవలసిన ప్రాముఖ్యమైన సత్యాలను అలక్ష్యం చేసే గొప్ప శోధన నీకు కలుగవచ్చు. ఈలాటి శోధననుండి తొలగిపోయి, బైబిలు ఉపదేశమనే సమతుల్యమైన భోజనంతో పోషించేలా, తలంపులు వచ్చే పధకాన్ని కలిగియుండాలి.

## బైబిలు వర్తమానాల కొరకు తలంపులను తెచ్చుకొనడం

తలంపులకు మొదటి మూలము నీ వ్యక్తిగతమైన అభీష్టాలే. ప్రత్యేకంగా నీవు ఆరంభించుతూ ఉండగా యిది నిజమౌతుంది. నీకు బహు యిష్టమైనవి లేదా అక్కరగా ఉన్నట్టు నీవు భావించే అంశాల విషయంలో ఎక్కువ ఉత్సాహపూరితుడవైయుంటావు. నీకు నచ్చిన వాటిని గూర్చి నీవు ఎక్కువగా ఎరిగియుంటావు. నీవు నేర్చుకున్న పాఠాలనుండిగాని, లేక నీ వ్యక్తిగతమైన అనుభవంనుండిగాని నీవు తలంపును తోడవచ్చు. నీవు దేనికొరకు జీవించావ్ లేక నీకు ఏమి జరిగింది (సంభవించింది) అనేది ప్రారంభించడానికి గొప్ప చోటు. నీ సొంత కన్వర్షన్ (మార్పు) యొక్క కథను నీవు చెప్పవచ్చు. అపొస్తలుడైన పౌలు తరచుగా తన కన్వర్షన్ యొక్క కథను చెప్పేవాడు (అపొ. 22:1-21; 26:2-29). ఏది ఎలాగున్నా, యితర చర్చనీయాంశాలను పెంచజూడాలి. నీకు నచ్చిన అంశాలే ప్రతి ఒక్కరికి నచ్చుతాయని ఎన్నడూ ఊహించకు (భ్రమించకు). నీవు కేవలం నీకు నచ్చిన వాటిమీదనే ప్రసంగిస్తూ ఉంటే, నీ శ్రోతలకు పట్టింపుగా ఉన్న అనేక అంశాలను నీవు పట్టించుకోకుండగనే పోతావు (వెళ్లతావు).

తలంపులకు మరొక మూలం నీ శ్రోతలయొక్క అవసరతలు వారి యింటరెస్టులను గూర్చిన నీ (జ్ఞానం) తెలివి. వారియొక్క అవసరతలు, పట్టింపులు తెలిసికొనడానికిగాను స్థానిక సంఘ సభ్యులతో కాలం గడుపు. సంఘంలో ఉన్న సమస్యను గూర్చి చర్చించాలి. నీ కండ్లు, చెవులు తెరిచియుంచు. జనులకు వారి పట్టింపులకు సెన్సెటివ్‌గా ఉండు. వారి భయములు నిరీక్షణలు, సందేహాలు, నమ్మకాలు, యిష్టాలు అయిష్టాలు నీవు తెలిసికొనే కొద్ది, వాటన్నిటిని పెంచగల సమయం లేనంత త్వరితగతిని తలంపులు రానారంభింపవచ్చు. అన్ని వేళ్లల ఒక నోట్‌బుక్కు పెన్ను నీ వెంట తీసికొని వెళ్లు. పాఠం కొరకు తలంపు వచ్చే ఏదో యొకదానిని నీవు చూచినప్పుడు లేదా విన్నప్పుడు, దాన్ని వ్రాసి ఉంచుకోడానికి సమయం తీసికో. ఆ సంఘటన జ్ఞాపకం వచ్చేంతగా వివరాలను వ్రాసుకో. నీవు దాని దగ్గరకు వెళ్లడానికి కొంత కాలం పట్టవచ్చు, అప్పుడు చెప్పబడింది లేక చేసింది నీకు జ్ఞప్తిరానట్టు నీవు కనుగొన వచ్చు.

ప్రస్తుతపు సంఘటనలు, దైనిక జీవితంపై వాటి ప్రభావము తలంపులకు మరొక మూలమైయుంటుంది. కొందరు బహిరంగ ప్రసంగీకులేమంటారంటే, "బైబిలు ఒక చేతిలోను వార్తా పత్రికను మరొక చేతిలోను ఉంచుకొని నీ ప్రసంగాలను తయారు చేసికో." లోకంలో ఏమి జరుగుతుంది మరియు ఆ సంఘటనలు క్రైస్తవ జీవిత విధానంపై ఎలా పని చేస్తాయో నేర్చుకొనడానికి అది యొక మంచి సలహాయే. అయినా, రక్షించడానికి దేవుని శక్తి కలిగియున్నది సువార్తగాని – వార్తా పత్రిక కాదు అనే సంగతిని మనస్సులో ఉంచుకో (రోమా 1:16).

మన సమాజానికి సంబంధించిన నైతిక పట్టింపులు తలంపులకు బహు శ్రేష్ఠమైన మూలములై యుంటాయి. క్రైస్తవులు తమ నడవడికను, తమ కుటుంబాలను, తమ వ్యాపారాలను ఎలా నడిపించుకోవాలని దేవుని ఆదేశములైయున్నవో అవి ఎల్లవేళ్లలా యోగ్యమైన పట్టింపులే. అలాటి పట్టింపులను గూర్చి మాట్లాడేటప్పుడు జనుల కోపాన్ని రేపే యిబ్బందిలో నీవు ఎల్లప్పుడు ఉంటావ్. వారి సొంత జీవితాలను, వారి వ్యాపారాలను వారెలా నడుపుకొంటారో "అది నీ

పని కాదని” కొంతమంది ప్రజలు అనుకుంటారు. దేవుడు ఆ ప్రశ్నమీద మాట్లాడియున్నట్టయితే, ఆ అంశం మీద దేవుని వర్తమానాన్ని అందించే ఒక మార్గమే నీవైయుంటావు గనుక అది నీ పనియే. యథార్థంగా ఉండాలి, వాగ్దానాలు నిలుపుకోవాలి, లైంగిక పవిత్రతను కాపాడుకోవాలి, ఆధారపడదగిన వాడవై యుండాలి అనేవి ప్రతి స్థానిక సంఘానికి, సమాజానికి పట్టింపులయ్యే ఉంటాయి.

సిద్ధాంతపరమైన ప్రశ్నలు తలంపులకు విశాలమైన మూలమైయుంటాయి. మతసంబంధమైన ఉపదేశాలు బహు వ్యత్యాసంగా ఉంటాయి. సంఘంలోను సంఘం వెలుపటను ఉన్న జనులకు ఏది నిజము అనే ప్రశ్నలుంటాయి. ఈలాటి సిద్ధాంతపరమైన ప్రశ్నలు, సంగతులు లేఖనానుసారంగాను ఫలభరితంగాను చర్చించాలి. నిన్ను అడిగిన లేక అడిగినట్టు నీవు విన్న ప్రతి బైబిలు ప్రశ్నను రాసి ఉంచుకో సమయము అవకాశము లభించినప్పుడు, ఈ ప్రశ్నలకు లేఖనానుసారమైన సమాధానాలు యివ్వడానికిగాను పాఠాలను సిద్ధపరచుకొని ఉంచుకో.

ఆచరించవలసిన విషయాలు పాఠాలకు అవసరమైన తలంపులను అనుగ్రహిస్తూ ఉంటాయి. జీవితం యొక్క దైనిక సంగతులు, అంటే వివాహమువంటివి, కుటుంబ విషయాలు, యితరులను ఎలా గౌరవించాలి అనేవి ఎల్లవేళలా అవసరమై యుంటాయి. క్రొత్త నిబంధనలోని పత్రికలు ఎక్కువగా సిద్ధాంతపరమైన భాగాలు, ఆచరించవలసిన వాటికి సంబంధించిన భాగాలు కలిగి ఉంటాయి. ఆచరణకు సంబంధించినవి క్రైస్తవ జీవితం కొనసాగించవలసిన విధానాన్ని తెలుపుతూ ఉంటాయి. మన అందరికి ప్రేమ, దయ, సాత్వికము, దీనమనస్సు అనే పాఠాలు అవసరమైయుంటాయి. ఎలా క్షమించాలో మన అందరం నేర్చుకొనడం అవసరం (ఎఫెసీ. 4:32). మనం ఒకరినొకరం పురికొల్పుకొంటూ ఉండాలి (హెబ్రీ. 10:24).

సాధారణమైన బైబిలు పఠనం మంచి క్రైస్తవ సాహిత్యం, మంచి సెక్యూలర్ బుక్స్ – తలంపులను కలిగిస్తూ ఉంటాయి. మంచి సమాచారంతో నీ మనస్సును పోషించి నీ జ్ఞానాన్ని వృద్ధిచేసికో (విశాలపరచుకో). ఏవి సత్యమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో, వాటిమీద ధ్యానముంచుకోమని బైబిలు మనకు తెలియజేస్తుంది (ఫిలిప్పీ. 4:8). నీవు నీ మనస్సును మంచి ఆలోచనలతో పోషించినట్టయితే, మంచి ఆలోచనలను యితరులకు అందజేయగలవు. పుస్తకాలను మరియు సాహిత్యాన్ని నీవు చదువుతూ ఉండగా, మంచి తలంపులను నీ నోట్‌బుక్‌లో వ్రాసికో. ఆ తలంపు ఎక్కడనుండి వచ్చిందో గుర్తించు, అవసరమైతే తిరిగి నీవు దాని వద్దకు వెళ్లగలుగునట్టు దాన్ని నీవు ఎక్కడ కనుగొన్నావో ఆ పేజినెంబరు వేసికో.

## నీ తలంపులను పరీక్షించుట

అది యోగ్యమయ్యిందో కాదో నీ తలంపును పరీక్షించుకో. ఒక మంచి తలంపును వర్తమానంగా పెంచడానికి ఎక్కువ సమయము పరిశోధన అవసరమైయుంటుంది. నీ పక్షంగా నీవు చేసే కృషికి, వెచ్చించే సమయానికి నీ తలంపు తగినదైయుందా? పెంపొందించి, ప్రసగించడానికి సిద్ధమయ్యిందంటే, శ్రోతల పక్షంగా వారు విని దాని ప్రకారం నడుచుకొనడానికి తగినంత సమయాన్ని ప్రయాసను వెచ్చించడానికి అది (తగినదేనా) యోగ్యమైనదేనా? ఒక

మంచి ప్రసంగం యొక్క తలంపు నాల్గు పాయింట్ల పరీక్షను పాస్ కావలసియుంటుంది. నీ తలంపును వృద్ధిచేసికొనడానికి అవసరమైన సమయాన్ని నీవు గడపకముందు, నిన్ను నీవు ఈ నాల్గు ప్రశ్నలను అడుక్కో:

1. అది *బైబిలును అనుసరించిందేనా?* (లేఖనానుసారమయ్యిందేనా?). ఈ తలంపు బైబిలు అంశమేనా? లేక బైబిలు వర్తింపుకు అది అనుగుణ్యమైనదేనా? బైబిలు బోధతో దానిని నీవు ఉదాహరించి, వివరించగలవా? లేక బైబిలు ఉపదేశంతో నీ తలంపుకు లోతైనభావాన్ని అనుగ్రహిస్తావా? నీ తలంపు ప్రశ్న రూపంలో ఉన్నట్టయితే, బైబిలు దానికి జవాబును ప్రసాదిస్తుందా? "నిబంధన మందసానికి ఏమి సంభవించింది?" అని అడగడం ఒక ఆసక్తికరమైన ప్రశ్నయైయుండవచ్చు; అయితే బైబిలు దానికి జవాబు అనుగ్రహించడం లేదు గనుక, ఆ ప్రశ్నకు ప్రసంగంలో జవాబుయివ్వడం వ్యర్థం. నీ తలంపుకు బైబిల్లో నుండి సత్యాన్ని తోడగలిగి, దాన్ని తేటపరచునదైయుండాలి.

2. అది *సంబంధమున్నదేనా?* నిజ జీవితానికి సంబంధించిన విషయాలను అది చర్చిస్తుందా? అది స్థానిక సంఘంలోని ఎక్కువమంది యొక్క శ్రద్ధను ఆకర్షిస్తుందా? అది ఎంత తేటగా ఆలోచించి, క్రమపరచి, బోధించినదైనాసరే, ప్రస్తుతపు అవసరతకు సంబంధించినదికాకుంటే అది వ్యర్థమే. నోవాహు దినాలలోని జలప్రళయానికి ముందు జనులు ఎందుకు బహు దీర్ఘకాలం జీవించారు అనే విషయం మీద ఒక క్రమబద్ధమైన ప్రసంగాన్ని తయారుచేసి యుండవచ్చు. నీవు దాన్ని ముగించిన తరువాత, "అయితే నేమి?" లేదా "ఎవడికి లెక్క?" అని జనులు అడిగారనుకో, వారి అవసరతలకు సంబంధంలేని దాన్ని చెప్పినట్టు నీవు ఫెయిల్ అయినట్టే. నేటి ప్రజల జీవితాలకు నీ వర్తమానం వర్తించలేదనుకో, అది నీ సమయాన్ని వారి సమయాన్ని కూడా వ్యర్థం చేసినట్టే.

3. అది *జరిగించగలదేనా?* ఈ తలంపును తగినట్టు పెంచి, బోధించినప్పుడు, దైనిక జీవితం కొరకు జరిగించగల లోతైన భావాన్ని యిస్తుందా? నీ శ్రోతలు శ్రేష్ఠంగా జీవించగలవారుగా లేక శ్రేష్ఠమైన జనులుగా జీవించడానికి అనుకూలమైన సందేశాన్ని అది యివ్వగలుగుతుందా? ప్రభువైన యేసులా ఎలా ఉండాలో అదివారికి తెలియ జేస్తుందా? "ఎలా చేయాలి" అనే ప్రసంగాలు వినడానికి జనులు యిష్టపడతారు. వారు చేయవలసింది ఎలాచేయాలో వారు తెలిసికోగోరతారు. కార్యం జరిగించేలా వారికి తలంపు కలిగించవలసి యుంటుంది. ఆచరించే తలంపులకు – శోధనను ఎలా జయించాలి, ఎక్కువ అర్థసహితంగా ప్రభురాత్రి భోజనాన్ని ఎలా తీసికోవాలి, మంచి పొరుగువారిగా ఎలా ఉండాలి, శ్రేష్ఠమైన తండ్రిగా లేక తల్లిగా ఎలా ఉండాలి అనేవి కొన్ని ఉదాహరణలుగా ఉంటాయి.

4. అది *సులభ సాధ్యమయ్యిందేనా?* ఆ తలంపు నీకు అనుకూలమయ్యిందేనా? నీ అనుభవముతో నీవు కలిగియున్న వాటితో నీవు దానిని చేపట్టగలవా? వివాహముకాని ఇరవైఏండ్ల యువకుడు పిల్లలను ఎలా పెంచాలో వివరించే వర్తమానం అనుకూలమయ్యింది కాకపోవచ్చు. అతనికి అనుభవంలేదు సరిగదా. తాను యువకుడై, ఏమి మాట్లాడుతున్నాడో అతనికి తెలియనివాడైయున్నట్టు అతడు కన్పించవచ్చు.

బైబిలు తర్జుమాలమీద సందేశం అవసరతలకు తగినదిగాను, ప్రాక్టికల్‌గాను ఉన్నా, అలాటి ఒక పాఠాన్ని కట్టడం కష్టం. ఆయా తర్జుమాలు ఎలా తయారయ్యాయో, వాటి

యొక్క నిర్దిష్టమైన ఉద్దేశాలు, ప్రతి ఒక్కదానిలో ఉన్న సమస్యల మీద నమ్మదగిన సమాచారాన్ని అందించే ఒక మంచి లైబ్రెరీ కావాలి. నీకు ఉన్న అనుభవం, తర్ఫీదు, మూలాలతో మేనేజ్ చేయగల తలంపులతోనే నీవు పని జరిగించు.

## ముగింపు

మంచి పాఠంకొరకు తలంపును తెచ్చుకొనడం ప్రారంభం మాత్రమే – ఆరంభించే స్థలం. ఇప్పుడు నీకొక మంచి తలంపు కలిగిందనకో, దానితో నీవేమి చేయాలి? మంచి ఆలోచనను నీవు సరిగా ఉపయోగిస్తావో లేదో అనే దానిని ఆ మంచి తలంపు నిర్ణయిస్తుంది. తలంపును తెచ్చుకొనడం – యింతకు అసలు దేవుని వాక్యంనుండి వచ్చిందే – నీ మనస్సు హృదయంలోనుండి శ్రోతల యొక్క మనస్సు హృదయాల్లోనికి పంపించే పనియే బహిరంగ ప్రసంగీకుడు చేసేది. మంచి తలంపును పెంచలేకపోవడం భయంకరమైన వ్యర్థత అయ్యుం టుంది. ప్రతి ప్రసంగపు తలంపుకూడా పదునుపెట్టబడాలి, నునుపు చేయబడాలి, యితరుల జీవితాలను దీవించేలా అవకాశమియ్యబడాలి.

# నీ తలంపును క్రమ బద్ధం చేసికొనడం

"క్రమబద్ధంగా ఉంచుకొనడం" అంటే ఖచ్చితమైన క్రమమైన రూపంలో చెప్పడం లేక వ్యక్త పరచడమని భావం. నీవు ఏమి ఆలోచనచేస్తున్నావో దానిని వ్రాతరూపంలో పెట్టే పద్ధతే అది. నీ తలంపును క్రమబద్ధంగా చేసేవరకు, అది కేవలం కరుకైన (మోటైన) యోచన మాత్రమే, తరచుగా అది నిర్దిష్టమైన దిక్సూచిలేకుండ ఉంటుంది. సమాచారం అందించడంలోని నీ విజయాన్ని నీ తలంపుతో నీవు ఏమి చేస్తావో అనేది నిర్ణయిస్తుంది.

వర్తమానాన్ని జతగా కూర్చడానికి నీవు పని చేసే సాధనం ఒక ప్రసంగపు తలంపే. ప్రతి మంచి సందేశమూ ఒక (యుక్తమైన) యోగ్యమైన ఆలోచనతో ఆరంభమౌతుంది. నీవు గొడ్డలిని కొన్నావని అనుకుందాం. అది కేవలం ఒక పరికరం మాత్రమే. తనంతట అదే ఏ శక్తీ కలిగియున్నది కాదు. దానికి నీవు చెల్లించిన ఖరీదుకు అది తగిందో కాదో దానిని నీవు ఉపయోగించేదానిపై ఆధారపడి యుంటుంది. దానిని నీవు పైన తగిలించి ఎన్నడూ వాడక పోయినట్లయితే, దాని విలువను ఎన్నడూ గుర్తించలేవు నీవు దాన్ని క్రిందికితీసి నీ ప్రయాసలో నిమగ్నుడవైయున్నట్టయితే, నీవు ఒక పెద్ద చెట్టును కొట్టగలవు. ప్రయోజనమైన దాన్ని సాధించడానికి నీవు ఫోకస్ చేసిన దానిలో వ్యత్యాసముంది. ప్రతి మంచి తలంపుకు గమ్యం అవసరం.

## సాధారణమైన గమ్యములు

నీ వర్తమానంనుండి ఎలాటి ప్రతిఫలాన్ని నీవు ఎదురుచూస్తావు? నీ శ్రోతల యొద్దనుండి నీవేమి ఎదురు చూస్తున్నావో నీవు ఎరిగేవరకు, కోరిన ప్రతిఫలాన్ని నీవు సాధించగలిగిన వాడవు కావు. మన ఉద్దేశాలకొరకు, ఒక ప్రసంగం జరిగించగల నాల్గు లక్ష్య సాధనలను మనం చూద్దాం.

1. ఉపదేశించడానికి లేదా సమాచారమందించడానికి. ఈ విధమైన ప్రసంగంలో శ్రోతల పక్షంగా వెనువెంటనే, కన్పించే ఏ కార్యాన్ని నీవు ఎదురుచూడకపోవచ్చు. శ్రోతగా అతని

లేదా ఆమె యొక్క జీవితంలో దాన్ని వర్తింపజేసికొనే విధంగా సమాచారం చిత్రింపబడి యుండవచ్చు. ఈలాటి వర్తమానానికి క్రమేపి, దీర్ఘకాలపు ఫలితమే గాని వెనువెంటనే వచ్చేది ఉండదు.

2. పురికొల్పడానికి. పురికొల్పడానికి (పేరేపించడానికి) చిత్రించబడిన సందేశం వెంటనే ప్రతిఫలాన్ని ఎదురుచూస్తుంది. అది కేవలం సమాచారాన్ని అందించడం మాత్రమేగాక, తీర్మానంతోకూడిన విధానంలో శ్రోతలకు తలంపులను కలిగిస్తుంది. హెబ్రీ. 10:24లో మనం ఒకరినొకరం ఎలా పురికొల్పుకోవాలో తెలియజేస్తుంది. ఈలాటి సందేశంయొక్క ఉద్దేశం కార్యం జరిగించేలా రేకెత్తించడమే. Batsell Barrett Baxter యిలా అన్నాడు, "ఉజ్జీవింపబడ కున్నట్టయితే, బలమైన తీర్మానాలు సహితం దాటిపోతాయి గనుక, ఈలాటివి అవసరమే ఎందుకంటే నిన్నటి నిప్పురవ్వలు క్రొత్తమంటలుగా గాలికొట్టించకపోతే ఆరిపోతాయి."[1]

3. ఒప్పించడానికి, ఒప్పింపజేయడానికి. ఈలాటి సందేశం యొక్క ఉద్దేశం శ్రోతను దేవుని వాక్యానికి లోబడేలా చేయడానికి. సువార్త సందేశాలన్నీ దాదాపుగా యిలాటివే. పాపం విషయమై ఒక వ్యక్తిని ఒప్పుకొనజేసి, క్రీస్తు యొక్క సువార్తకు లోబడేలా చేయడానికి అవి చిత్రింపబడ్డాయి, లేదా జీవితంలో జరుగుతున్న ఒక తప్పును దిద్దుకొనేలా చేయడానికి చేయబడ్డాయి. ఈ కొవకు చెందిన ప్రసంగాన్నే అపొ. 2లో పేతురు ప్రసంగించాడు, అపొ. 7లో స్తెఫను ప్రసంగించాడు. అందులో ఖండించడం, గద్దించడం చేర్చబడి యుంటాయి. 2 తిమోతి 4:2లో పౌలు యిలాటి పాఠాలను గూర్చి ప్రస్తావించాడు. ఇవి బోధించడం కష్టతరంగా ఉంటాయి, ఎందుకంటే, మార్పును అనేకులు ప్రతిఘటిస్తూ ఉంటారు. బాగా చేసినట్లయితే, ఎలాగైనా, ఈ సందేశాలు సాధారణంగా ప్రత్యక్షంగా కన్పించే ఫలితాలను తెస్తాయి.

4. ఆదరించడానికి లేక ప్రోత్సహించడానికి. కొన్నిసార్లు స్థానిక సంఘం కేవలం బలపరచబడవలసియుంటుంది. ప్రసంగించడంలోని ఉద్దేశాల్లో ఒకటి క్షేమాభివృద్ధి కలిగించడం లేక కట్టడం (ఎఫెసీ. 4:12–16). కష్ట సమయాలలో దేవుని ప్రజలకు లేవనెత్తే, విశ్వాసాన్ని నిర్మించే వర్తమానాలు అవసరం. కష్ట సమయాల్లో విశ్వాసాన్ని బలపరచడానికే పేతురు యొక్క రెండు పత్రికలు వ్రాయబడ్డాయి.

## నిర్దిష్టమైన తలంపులు

నీ మనస్సులో దాగిన నీ సొంత ఉద్దేశాలను నిర్వచించడానికిగాను, నీ తలంపులను మాటలలో పెట్టడానికి నిన్నునీవే క్రమశిక్షణ చేసికోవాలి. నీ తలంపులను నీవు వ్రాసేటప్పుడు, నీవు ఎంత మంచిగా దానిని ఆలోచన చేసియుంటావో నీవు నేర్చుకుంటావు. ఉదాహరణకు, ప్రభురాత్రి భోజనంపై సంఘానికి కొంత ఉపదేశం అవసరమని నీవు ఆలోచనచేసియుండవచ్చు. అది యోగ్యమైన ఆలోచనే, కాని అది బహు విశాలమైన సాధారణమైన తలంపు మాత్రమే. ప్రభురాత్రి భోజనంలో దేన్ని గూర్చి స్థానిక సంఘ సభ్యులు తెలిసికొనవలసిన అవసరముంది? ప్రభురాత్రిభోజనమును గూర్చిన ప్రతి విషయము వారు తెలిసికోనవలసియుంటే, ఆ వర్తమానాన్ని పరంపరలో విభాగింపవలసి యుంటుంది. వారు తెలిసికొవలసినదంతా కూడా ఒక్క పాఠంలో వారికి నీవు ఉపదేశింపలేవు. ఒక్కోసారి ఒక్కొక ప్రత్యేకమైన వర్తమానాన్ని తెలియజేయడం

యుక్తమై యుంటుంది.

## నిర్దిష్టమైన దిక్సూచులు

ఏదిశగా నీవు తీసికొని వెళ్లాలని నిర్ణయించు కొనాలంటే, ముందుగానే ఉపదేశింప గోరతావో, ప్రేరేపింపగోరతావో, ఒప్పింపగోరతావో, ప్రోత్సహింపగోరతావో నిర్ణయించు కోవాలి. ఒకవిధంగా యివన్నీ చేయవచ్చు, కాని నీ అంశాన్ని ఒక్క దానితో ముడిపెట్టికొని యుండడం బహు శ్రేష్ఠం. ఆ సమయానికనీ, స్థానిక సంఘానికిని తగినదై నీ అంశం ఉండునట్టు జాగ్రత్తపడు. అప్పుడు, నీ ఉద్దేశాన్ని నెరవేర్చుకోగలుగునట్టు నీకు చేతనైనన్ని మార్గాల్లో ఆలోచించి వ్రాయి. ఒక ప్రసంగంలో లేక పాఠంలో నిర్దిష్టమైన గురిని చేరడానికి నీవు యింకా నీ తలంపును క్రమపరచ ప్రయత్నిస్తున్నావన్నమాట. తేటైన గమ్యంలేని ప్రసంగం ఖచ్చితమైనదేదీ సాధించలేనిదై, ఒక యోచననుండి మరియొక యోచనకు క్రమంలేని మార్గంలో తిరుగుతూ ఉంటుంది.

ప్రభురాత్రి భోజనం మీద ఒక పాఠాన్ని పెంచడంలో, ఈ క్రింద చూపబడినట్టు ఒక జాబితాను నీవు తయారు చేసికోవచ్చు:

"సంఘము ఎక్కువ అర్థసహితంగా ప్రభురాత్రిభోజనంలో పాల్గొనేలా ...

... ఈ విధంగా నేను సహాయం చేయగలను.

... ద్రాక్షరసము, పులియనిరొట్టె వేటికి మారుగా నిలిచియున్నాయో వారికి ఉపదేశిస్తుంటాను.

... మన పాపములకొరకు మహా గొప్ప వెలను ప్రభువైన యేసు చెల్లించిన విధానాన్ని వివరించుతూ

... వారు పాలుపొందే సమయంలో చదువవలసిన లేఖన భాగాలను తెలియజేస్తూ.

... వారు ఏమి ఆలోచించవలసియుంటుందో దానిని గూర్చి ఒప్పించుతూ.

... ఏకాగ్రతను పెంచుకునేలా తమ కండ్లను వారు మూసికొనవలెనని సలహాయిస్తూ.

... మన పాపక్షమాపణ యొక్క ఉత్సవముగ దానిని జరిగించుచు.

... ఆ విందులో పాలుపొందడానికి వారానికొకసారి కూడుమని దేవుడు ఎందుకు కోరుతున్నాడో ఉపదేశించుతూ.

... దానివలన మనం పొందవలసిన మేళ్లతో వారిని పురికొల్పుతూ.

... పాలుపొంపులలో ఉన్న భావాన్ని వివరించుతూ.

... ప్రభురాత్రి భోజనం జ్ఞాపకం చేసేవాటన్నిటిని గూర్చి చదువుతూ"

ఈ దిశలన్నిటిని నీవు ఒక్క సారే తీసికొనలేవు. శ్రేష్ఠమైన విధంగా ఏ మార్గంలో నీ ఉద్దేశాన్ని సాధించగలవో లేక సంఘం యొక్క అవసరతను తీర్చగలవో ముందుగా నిర్ణయించుకొనడం ఉత్తమం. చెప్పాలంటే, అవన్నియు మేలైనవే! తగిన కాలంలో, వాటన్నిటిని తీసికోగలవు, కాని వాటినన్నిటిని ఒక్క ప్రసంగంలో చేర్చబడలేవు. పలు తలంపులను కలిపి సరిగా చెప్పలేక పోవడంకంటే, ఒక తలంపును సరిగా వివరించడం యుక్తమై యుంటుంది.

ప్రతి అవకాశాన్ని ఆలోచించాక, నీ గురిని చివరిగా రీఫైన్ చేసికొని దానికి నిర్దిష్టమైన దిక్కును యిలా చూపు: "అది పాపక్షమాపణ యొక్క ఉత్సవమని వివరించుతూ, ప్రభురాత్రి భోజనంలో అర్థసహితంగా పాలుపొందేలా సంఘాన్ని పురికొల్పడం నా గురియై యుంది"

అని  దాన్ని తీర్చి దిద్దుతావ్. ఇప్పుడు నిర్దిష్టమైన దిక్కును చూపే ప్రత్యేకమైన ఉద్దేశముంది. ఇక్కడనుండి నీ సిద్ధపాటు చాల సులభమైయుంటుంది. నీ వెక్కడికి వెళ్లతావో నీకు తెలుసు ఆ మార్గాన్ని అనుసరించేలా నీ సిద్ధపాటును పరిమితి చేసికొనగలవు.

## ముగింపు

సిద్ధపాటులో ఉన్న తరువాత మెట్లగుండా నీ ఆలోచనలను పెంపొందించుకొనడానికి వెళ్లుతూ ఉండగా, నీ ఉద్దేశానికి నీవు నమ్మకంగా ఉండాలి. నీ ఉద్దేశాన్ని మార్చుకొనడానికో దిద్దుకొనడానికో నీవు నిర్ణయించుకున్నప్పటికీ, నీ చివరి గమ్యానికి నీవు నమ్మకంగా ఉండు. గీతలోనే నిలిచియుండు. పట్టాలు తప్పిన రైలుబండి ఎక్కడికీ వెళ్లలేదు.

నీ గురిని చేరడానికిగాను నీ పాఠాన్ని ఎలా పెంపొందిస్తావు? వచ్చే పాఠాల్లో, నీ గురియొద్దకు చేరడానికి నీ ఆలోచనలను ఎలా సేకరించి అమర్చుకోవాలి, నీ శ్రోతలను నీతో ఎలా తీసికొని వెళ్లాలి అనే విషయాలను నీవు నేర్చుకొంటావు.

---

సూచన

[1]Batsell Barrett Baxter, *Speaking for the Master* (Grand Rapids, Mich.: Baker Book House, 1972), 56.

# నీ సందేశాన్ని ప్రకాశవంతం గావించు

ప్రసంగం యొక్క సిద్ధపాటులో యింతవరకు మన పఠనమందు ఈ క్రింద యివ్వబడిన చెక్‌లిస్ట్ అంచలంచలుగా రివ్యూ చేస్తుంది:

- తలంపును తెచ్చుకొనడం
- నీ తలంపును క్రమబద్ధం చేసికొనడం
- నీ తలంపును పరిశోధన చేయడం
- నీ పరిశోధనను క్రమబద్ధం చేసికొనడం

ఈ పాఠంలో నీ సందేశాన్ని "ప్రకాశించునట్లు" చేయడాన్ని గూర్చి నీవు నేర్చుకుంటావ్. నీ వర్తమానాన్ని ప్రకాశవంతంగా చేయడం అంటే దానిమీద వెలుగు పడునట్లు చేయడం అని అర్థం. వెలుగు ఒక దానిమీద పడేలా చేసినప్పుడు, అది ఎక్కువ తేటగా కన్పిస్తుంది. నీ సందేశాన్ని తేటపరచడానికి నీవు ఏది చేసినా, దాని ప్రభావం అధికమౌతుంది. తానేమి చెప్పుతున్నా తానే ఎరుగని ప్రసంగీకునికి ప్రసంగం వినడంకంటే ఎక్కువగా శ్రోతలను విసికించేది మరేది ఉండదు! నీవు మాట్లడేటప్పుడు, నీవు అర్థం అయ్యేలా నీవు చేయగలిగిన దానినంతటిని చేయ్. నీ సిద్ధపాటు విధానంలో నీ వర్తమానం బహు తేటగా ఉండేలా చేయడం అనేది నీవు వేసే అతి ప్రాముఖ్యమైన అడుగుల్లో యిది యొకటి. వర్తమానాన్ని ప్రకాశవంతంగా చేయడంలో చట్టబద్ధం చేయడం, ఉదహరించడం అనేవి యిమిడి ఉన్నాయి.

## చట్టబద్ధం చేయడం

చట్టబద్ధం చేయడమంటే అధికారాన్ని, రుజుబద్ధమైన నిరూపణను యివ్వడం అని అర్థం. వర్తమానికుడుగా, వర్తమానాన్ని పొందేవారికంటే నీకు ఏ ఎక్కువైన అధికారం లేదు. వారు నీ మాటలు ఎందుకు ఆలకించాలి? నీవు కేవలం దేవుని వర్తమానికుడవుగా ఉన్నందువలననే. "ఒకడు బోధించినయెడల దైవోక్తులను బోధించినట్టు బోధింపవలెను...."

(1 పేతురు 4:11). ప్రభువైన యేసు అధికారముగలవానివలె బోధించినందున విన్నవారు ఆయన బోధకు ఆశ్చర్యపడ్డారు (మత్తయి 7:29). ఆయన ఎందుకు అధికారంతో మాట్లాడారంటే, ఆయన తన తండ్రి చిత్తాన్నే మాట్లాడారు.

నీవు దేవుని వాక్యాన్ని ప్రకటించేటప్పుడు, నీవు నీ సొంత ఉద్దేశాలను యివ్వడంలేదు; నీవు దేవుని యొక్క మనస్సును, ఆయన చిత్తాన్ని నీవు మాట్లాడుతున్నావు. నీవు అలా చేయనట్లయితే, ఆయన నామమున ప్రకటించడానికి నీకు ఎలాటి అధికారమును లేదు. దేవుని అధికారంతో నీ వర్తమానాన్ని ప్రకాశవంతంగా చేయడానికి గల ఏకైక మార్గం లేఖనములపై ఆధారపడడమే. నీవు మాట్లాడే ప్రతి మాటమీద దేవుని వాక్యపు వెలుగును ప్రకాశింపజేయుము. నీవు చెప్పేదాన్ని రుజువు పరచడానికి బైబిలు భాగాలను యిమ్ము. ఆ విషయం మీద బైబిలు సందేశం తేటగా లేకపోగా నీవు జవాబు చెప్పవలసియుంటే, నీవు నీ సొంత అభిప్రాయాన్ని యిస్తున్నట్టు వివరించు. బైబిలు తేటైన ఉపదేశం ప్రసాదించని అధికారాన్ని నీ వెన్నడూ తీసికొనవద్దు. బైబిలు జవాబు యివ్వని ప్రశ్నపై, సాధారణంగా, నీ అభిప్రాయాన్ని యివ్వకుండడం అత్యుత్తమం.

నీ సిద్ధపాటులో చివరి దశయందు, నీవు సిద్ధపరచుకున్న అవుట్‌లైన్ గుండా జాగ్రత్తగా వెళ్లి, లేఖనంచేత బలపరచబడని ఏ మేజర్ (ఆలోచన) తలంపైనా ఉంటే దాన్ని తీసివేయి. వినేవారు అలాటి ఆలోచనలను ప్రశ్నించి, నీ నమ్మకత్వాన్ని సహా ప్రశ్నిస్తారు. నీవు చెప్పే ప్రతిదానిని బైబిలు అధికారంతో రుజువుచేయడానికి (డిఫెండ్ చేయడానికి) నీవు సంసిద్ధంగా ఉండాలి (యూదా 3; 1 పేతురు 3:15). నీవు చెప్పేదానంతటిగుండా దేవుని యొక్క సత్యమును ప్రకాశింపనిమ్ము. నీవు చెప్పే ప్రతిదానిని లేఖనాధారంతో చట్టబద్ధం చేయువాడవై యున్నట్టయితే, నీవు శ్రేష్ఠమైన సువార్తికుడవైయుండి, గౌరవాన్ని పొందగలవు. అట్టిది నీ వర్తమానం చుట్టు యథార్థత అనే రింగును ప్రసాదిస్తుంది.

## ఉదహరించడం

ఉదహరించడం అనేది తనంతట అదే కళయైయుంది. నీ ఆలోచనల యొక్క అంతర్భాగంగుండా నీ శ్రోతలు చూడగలగడానికి ఉదహరించడం ఒక కిటికీయైయుంది. అది వెలుగును కుమ్మరిస్తూ, నీ వర్తమానంలోని నీడలను, చీకటి మూలలను తీసివేస్తుంది. బహు ఫలభరితంగా ఉదహరించడానికి ఈ క్రింద కొన్ని మార్గాలు యివ్వబడ్డాయి.

1. కథ చెప్పడం. ప్రభువైన యేసు తరచుగా తన వర్తమానాన్ని ఒక కథచెప్పడం ద్వారా ఉదహరించారు. శ్రోతలు తన వర్తమానాన్ని పొందడానికి మాత్రమేగాక, దాన్ని జ్ఞాపకం చేసికొనడానికి అనువుగా ఉపమానాలను, అంటే ఎరుకైన సంఘటనలతో కూడిన కథలను కొన్ని సార్లు ఆయన చెప్పారు (మత్తయి 13). ఎరుకైన జనులు, స్థలాలు, సంఘటనలతో కూడినదై కథ శ్రోతలకు తగిపోయినదిగాను, పనికివచ్చేదిగాను ఉండాలి. అది క్లుప్తంగాను, చిన్నగాను ఉండాలి. అది వ్యక్తిగతమైన అనుభవమే అయ్యుండవచ్చు, పాఠానికి సరిపోయేలా దాన్ని మల్చాలి, లేదా నీవు విన్నదిగాని లేక చదివిందిగాని. సాధ్యమైనప్పుడు బైబిలు కథనే ఉదహరణగా ఉపయోగించు. నీ శ్రోతలయొక్క బైబిలు జ్ఞానాన్నిపెంచే చేర్చబడిన విలువ

దీనికుంటుంది.

2. ప్రక్రియ పాఠాలు. (ఒక వస్తువును ఉపయోగించి చెప్పే పాఠాలు) ఈ పాఠాల్లో విషయాన్ని తేటపరచి, వర్తమానంపై దృష్టికేంద్రీకరింపబడేలా ఒక వస్తువును, కొన్ని సార్లు ఒక వ్యక్తిని సాధనంగా ఉపయోగపడుతుంది. స్తెఫనును రాళ్లతో కొట్టి చంపడాన్ని గూర్చి మాట్లాడేటప్పుడు (అపొ. 7), మనిషి తలయంత పెద్దరాయిని ప్రదర్శించడంవలన వర్తమానాన్ని శ్రోతలకు అందించడంలో సహాయపడవచ్చు. ప్రభువైన యేసు సిలువవేయబడడాన్ని గూర్చి పాఠం చెప్పే సమయంలో పెద్ద మేకును, ముండ్లతో చేయబడిన కిరీటాన్ని సాధనంగా వాడవచ్చు. ఒక సందర్భంలో ప్రభువైన యేసు ఒక చిన్న బిడ్డను తన పాఠం యొక్క సాధనంగా ఉపయోగించారు (మత్తయి 18:1-6). మరో పర్యాయం యెరూషలేము దేవాలయాన్ని ఆయన పాఠానికి సాధనంగా ఉపయోగించారు (మత్తయి 24:1-3).

3. ప్రస్తుతపు సంఘటనలు ప్రపంచంలో మన చుట్టు ఏమి జరుగుతుందో అనేది నీ పాఠానికి నీవు ఉదాహరణగా ఉపయోగించుకోవచ్చు. అది నీవు వార్తాపత్రికల్లో చదివింది కావచ్చు లేదా రేడియోలో నీవు విన్నదికావచ్చు. అది ప్రతి ఒక్కరు ఎరిగిన ప్రపంచపు సంఘటన అయ్యుండవచ్చు, లేదా ప్రతిఒక్కరికి ఆసక్తిని కలిగించే అంతగా తెలియని సంఘటన అయ్యుండవచ్చు.

4. దృశ్య సహాయములు. ఉపయోగించే వస్తువులు దృశ్య సహాయములైయుండగా, యితర రకాలైనవాటిని సహితం ఆలోచన చేయవచ్చు. ఎక్కువ దృశ్య సహాయాలు గీయబడిన లేక ప్రింటుచేయబడిన పటాలు, ముందుగా సిద్ధపరచబడిన చార్టులు, చాక్ బోర్డుమీద వ్రాయబడిన స్కెచ్‌లు, లేదా ముందుగానే ప్రింటుచేసి పంపిణీచేసిన మెటీరియల్ (వగైరాలై యుంటాయి).

5. పద్యాలు లేక పాటలు. కొన్ని సార్లు నీవు చెప్పదలచుకున్నదాన్ని ఒక కవి లేక పాట రచయిత యింతకు ముందే మాటల్లో పెట్టియుండవచ్చు. నీ వర్తమానాన్ని ప్రకాశింప చేయడానికి ఒక పద్యమో లేక పాటో విలువైనదిగా ఉండవచ్చు.

## ప్రకాశింపజేయు విషయాన్ని సేకరించడం

ఆయా అంశాలమీద లేఖనాలను సమకూర్చి భద్రపరచుకొనడాన్ని గూర్చి మనం యింతకు ముందే చర్చించాం. బైబిలు కంకార్డెన్స్ లభ్యమైనట్టయితే, నీ అంశాన్ని గూర్చిన వచనాల కొరకు చూడు. బైబిలు నిఘంటువు కూడా సహాయపడవచ్చు. నీ ప్రసంగాన్ని సిద్ధపరచుకొనడంలో పరిశోధన జరిగించిన దశలోనే నీవు వీటిని ఉపయోగించి యుండవచ్చు.

భవిషత్ ఉపయోగం కొరకు ఉదాహరణలను సేకరించి భద్రపరచుకొనడం అనేది అలవరచుకొనవలసిన ఒక మంచి అలవాటు. ఉదాహరణలను భద్రం చేసికొనడం కొరకు ఒక ఫోల్డర్‌నుగాని, ఫైలునుగాని ఉంచుకో. నీవు ఎప్పుడైనా ఒకనాడు ఉపయోగించతగిన కథను విన్నప్పుడు, దాన్ని వ్రాసికొని, ఒక అంశం పేరు దానికిపెట్టి, ఉదాహరణల ఫోల్డర్‌లో ఉంచుకో. నీ జీవితంలోని ఒక సంఘటన తరువాత కాలంలో ఒకమంచి ఉదాహరణగా ఉపయోగపడవచ్చు, దాన్ని నోట్ చేసికొని ఫైల్లో ఉంచుకో.

వివరాలు నీకు గుర్తుకు వచ్చేలా తగినంత అధికంగా నోట్సు వ్రాసికో. కొన్ని నెలలు లేక సంవత్సరాల తరువాత వివరాలను జ్ఞాపకంచేసికోగలనని తలంచకు. వార్తా ప్రతికల్లో గాని, మాసపత్రికల్లోగాని వ్యాసాల్లోనుండి అవసరమైన వాటిని నోట్‌చేసికో లేక కత్తిరించి ఉంచుకో. నీవు ఎల్లప్పుడును ఉదాహరణల కొరకు వెదకుతూ ఉండు.

ఇక్కడ హెచ్చరిక మాట అవసరమౌతుంది. ప్రసంగపు తలంపుకొరకు ఎన్నడును నీవు ఉదహరణల ఫైలునొద్దకు వెళ్లవద్దు. ప్రసంగాన్ని పెంపొందించే పద్ధతిలో అడ్డు దారి త్రొక్కి, ఒక మంచి కథను లేక ఉదాహరణను కనుగొన్నప్పుడు దాని చుట్టు నీ ప్రసంగాన్ని కట్టాలనే శోధనలో నీవు పడవచ్చు. ఇది జరిగినప్పుడు, శ్రోతలకు కావలసిన, వారు పొందదగిన వర్తమానం యొక్క లోతు, బైబిలు భావార్థం లోపిస్తుంది. ఉదాహరణలను నీ సందేశాన్ని ఉదహరించడానికి మాత్రమే వినియోగించు.

## ముగింపు

సరిపోయినన్ని లేఖన భాగాలు నీ వర్తమానాన్ని చట్టబద్ధంచేసి, దానికి యథార్థతను ఆపాదిస్తాయి. ఉదాహరణలు నీ సందేశానికి కిటికీలుగా ఉంటాయి. నీ ఆలోచనలను గ్రహించేలా అవి వెలుగును వరదలా పొర్లిస్తాయి. ప్రకాశవంతమైన ప్రసంగాన్ని నిర్మించడం దీర్ఘసమయాన్ని తినివేసే, శ్రమతోకూడిన పనియైయుంటుంది, అయితే అది విలువగలదైయుంటుంది.

# నీ వర్తమానాన్ని జీర్ణం చేసికో

ఖాళీ బక్కెట్‌లోనుండి తృష్ణగొన్నవాని దప్పికను తీర్చడానికి నీళ్లు యివ్వలేవు. ప్రసంగాన్ని సిద్ధపరచే విధానంలోని అయిదు మెట్లుగుండా వెళ్లాకా, నీవు సందేశాన్ని అందించడానికి సిద్ధపడియున్నట్టు నీవు తలంచవచ్చు. వాస్తవంగా చెప్పాలంటే, నీవు యింతకముందున్న దానికంటే యిప్పుడు శ్రేష్ఠంగా సిద్ధపడియున్నావు. ఏదియెలాగున్నా, నీవు బావిని మాత్రమే త్రవ్వి, నీళ్లు లభ్యమయ్యేది కనుగొని, బావిలోనుండి నీళ్లను చేదుకునే సామాగ్రిని నిర్మించుకున్నావు. ఇప్పుడు, నీవు నీ సొంత బక్కెట్‌ను నింపుకోవాలి.

నీ వర్తమానం నీలో ఒక భాగంగా మారిపోవాలి. దాన్ని నీవు జీర్ణం చేసికోవాలి. మన విధానానికి యిది ఆరవ ప్రాముఖ్యమైన మెట్టును కలుపుతోంది. తీసికొనవలసిన మెట్లను (అంచెలను) గుర్తు చేసికో:

- ఉద్దేశాన్ని (తలంపును) తెచ్చుకొనడం
- తలంపును క్రమబద్ధంగా ఉంచుకో
- నీ తలంపును పరిశోధించు
- నీ పరిశోధనను ఆర్గనైజ్ చేయడం
- నీ వర్తమానాన్ని కాంతివంతంగా చేయడం
- నీ వర్తమానాన్ని జీర్ణంచేసికొనడం

అది నీవు గ్రహించావో లేదోగాని, నీవు నీ వర్తమానము విడదీయబడలేకుంటాయ్. నీవు దానిలో మునిగిపోవాలి, దానిని పూర్తిగా త్రాగివేయాలి, దానితో నింపబడాలి. దానితో కప్పబడాలి; దానిలో పొర్లాలి; దానిమైకంతో ఉండి పోవాలి, దానిని గూర్చి ఉత్సాహ భరితుడవై యుండాలి.

ప్రకటన10లో బలిష్ఠుడైన యొక దేవదూత చేతిలో చిన్నపుస్తకం ఉన్నట్టు యోహాను చూచాడు. ఆదూత చేతిలోనుండి ఆ చిన్న పుస్తకాన్ని తీసికోమని పరలోకం నుండి యొక శబ్దం యోహానుకు తెలిపింది. ఆ పుస్తకం తీసికొనే సమయంలో "దానితీసికొని తినివేయుము, అది నీకడుపునకుచేదగును గాని నీ నోటికి తేనెవలె మధురముగా ఉండునని" ఆ దూత యోహానుకు తెలియజేశాడు (9 వ.). ఆ దర్శనం వర్ణించుతున్నది (1) సువార్త ప్రకటన యొక్క తియ్యటి చేదుతనం. క్రీస్తు సువార్తకు వర్తమానికుడైయుండి సేవచేసేదానికంటే తియ్యటి

భాగ్యమేదీలేదు. మరోవైపు, అది కొన్ని సమయాల్లో ఒంటరి వ్యాపారమైయుండి చేదైన రుచిగా మారుతుంది. వర్తమానం తరచుగా అపార్థం చేసికోబడుతోంది. మరియు కొన్నిసార్లు నిరాకరింపబడుతుంది. త్వరలోనే అనేకమంది సువార్తికులు ఈ పాఠాన్ని నేర్చుకుంటారు; ఈ లేఖనం వేరొకదానిని మనం నేర్చుకోగోరుతున్నాం: ఈ దర్శనం ఉదహరించేదేమంటే (2) నీవు నీ వర్తమానాన్ని జీర్ణం చేసికోవాలి – అనేది.

## కొన్ని చిన్న టెక్నిక్‌లను వాడు

వర్తమానాన్ని జీర్ణంచేసికొనడంలో వాడే రెండు చిన్నటెక్నిక్‌లను మనం చూడక ముందు, ఈ సత్యాన్ని విస్మరింపకుండ మనం నిశ్చయత కలిగియుండాలి. నీ వర్తమానాన్ని జీర్ణించు కొనడానికి (1) సమయం, (2) ఏకాగ్రత కావలసివస్తుంది సుమీ. కొన్నిసార్లు, శనివారాన, నేను ఒంటరిగా వెళ్లి సెలఏరు ఒడ్డున కూర్చుండి, నేను ఏకాగ్రత కలిగియుండేలా పారుతున్న నీళ్లయొక్క ధ్వని తక్కిన ప్రపంచాన్ని నన్ను వేరుచేసేలా చూస్తాను. మరుసటి దినాన నేను సంఘంతో పంచుకోబోయే ఆలోచనలలో మునిగిపోతాను. ఆదివారం ఉదయం పెందలకడలేచి నా వర్తమానం యొక్క మూలం – దేవునితో సమయాన్ని గడపుతూ, నేను అందించబోయే సందేశాన్ని నేను ఆశ్వాదించు కునేలా జాగ్రత్తపడతాను.

నీ వర్తమానాన్ని నీవు జీర్ణించుకొనడానికిగాను యిక్కడ యివ్వబడ్డ కొన్ని అంచెలను నీవు అనుసరించవచ్చు:

మొదటిది, నీ అవుట్‌లైన్ను (outline) “కీలకమైన మాటల” అవుట్‌లైనుగా కుదించు. నీ మెయిన్ పాయింట్స్‌లోను సెకండరీ పాయింట్స్‌లోను ప్రాతినిధ్యమిచ్చి ఆలోచన అంతటిని జ్ఞాపకం చేసే ఒక్క మాటను కనుగొనడంవలన నీవు దీన్ని చేయగలవు. ఉదాహరణకు, నీ పాఠం అవుట్‌లైన్ ఈ విధంగా కనబడవచ్చు:

I. బాప్తిస్మమనగా నేమి?
II. బాప్తిస్మం ఎవరు పొందాలి?
III. ఒకడు బాప్తిస్మం ఎప్పుడు పొందాలి?
IV. ఒకడు బాప్తిస్మం ఎందుకు పొందాలి?

నీ అవుట్‌లైన్ను ఎఫెక్టివ్‌గా యిలా నీవు కుదించుకోవచ్చు:

I. ఏమి?
II. ఎవరు?
III. ఎప్పుడు?
IV. ఎందుకు?

నీవు మాట్లాడే సమయంలో నీకు నోట్సు కావలసివస్తే, ఈ క్లుప్తమైన “కీలకపు మాట” అవుట్‌లైన్ సరిపోయేదైయుండాలి. నీ బైబిల్లో ఎక్కడో దాన్ని ఉంచుకోవచ్చు.

రెండవది, కంఠస్తంచేయ్ లేదా ఒకదానివెంట ఒకటి వచ్చేలా మానసికమైన పటాలను

ఏర్పరచుకో. కొంతమంది సువార్తికులే కేవలం అవుట్‌లైనును మాత్రమేగాక, వారి సందేశం యొక్క చేతి ప్రతులన్నిటిలో కంఠస్తంచేయడంలో సామర్థ్యం కలిగియుంటారు. ఇతరులు తగిన విషయక్రమంలో వారి సందేశముల యొక్క పటాలను ఏర్పరచుకొనడంలో నిపుణులైయుంటారు. పైచూపబడిన మనశాంపిల్ (sample) అవుట్‌లైన్లో "బాప్తిస్మమనగానేమి?" అని కంఠస్తం చేయడానికి మారుగా జనులు "బాప్తిస్మం" అని పొందే విధానాలన్నిటిని మానసిక పటాలను మాత్రమే ఏర్పరచుకొని, బైబిలు వర్ణించిన బాప్తిస్మాన్ని వివరించడంతో ముగిస్తారు. సందేశాన్ని అందించడంలో, తమ మనస్సులో సిద్ధంచేసికొన్న పటాలను వారు వివరిస్తారు. రెండు, మూడు, నాల్గు పాయింట్లకొరకు, ఎవరు బాప్తిస్మం పొందాలి, విశ్వాస విధానంలో ఏ సమయమప్పుడు బాప్తిస్మంపొందాలి, బాప్తిస్మంలో బైబిలు ఉద్దేశమేమి అనేవి వివరించడానికి మానసికమైన పటాలను సిద్ధం చేసికొంటారు.

సందేశంలో వినియోగించే లేఖన భాగాలను జీర్ణించుకొనడంలో కూడా యిదే నిజమైయుంటుంది. నీవు (1) కంఠస్తం చేయడాన్నిగాని (2) పటాలను చిత్రించు కొనడం గాని ఉపయోగింపవచ్చు. సందేశంలోని లేఖన భాగాలను మానసికమైన పటాలుగా చేసికొని నీ సొంతమాటల్లో వాటిని పెట్టడమే పిక్చరింగ్ అంటే. కొన్నిసార్లు ఎక్కువ ఎఫెక్టెవ్‌గా ఉండాలనుకుంటే, ఒత్తిపలకడానికి లేఖన భాగాలను నీవే చదువవచ్చు లేదా శ్రోతల్లో ఎవరో ఒకని చదువమని అడుగవచ్చు.

## నీ హృదయాన్ని సిద్ధపరచుకో

గత పాఠంలో మనం నేర్చుకున్నట్టు, ప్రీచింగ్ వెనుక ఉండే ఉద్దేశం ఎల్లవేళలా పవిత్రమైనదైయుండాలి. వర్తమానంతోపాటు అంతరంగ పురుషుడు సహా సిద్ధపరచబడాలి. "నోటపడునది మనుష్యుని అపవిత్రపరచదు గాని నోటనుండి వచ్చునదే మనుష్యుని అపవిత్రపరచును" (మత్తయి15:11) "(హృదయమందు నిండియుండు దానిని బట్టి నోరు మాటలాడును గదా" (మత్తయి 12:34b) అని మనం చదువుతాం.

హృదయపు సిద్ధపాటు అనేది కేవలం మనం ప్రసంగించడానికి సిద్ధపడినప్పుడు జరిగే ఒక సమయపు సంఘటన మాత్రమే కాదు. అది ఎడతెగకుండా జరిగే విధానం. జీవితానికి అనేకమైన మరు మార్గాలుంటాయ్, వాడు అక్కడ ఉన్నట్టు మనము ఎరుగకుండగనే అపవాది తన కార్యాలను జరిగించి మన జీవితాలను పాడుచేయగలడు. నీవు ప్రకటించడానికి సిద్ధపడిన ప్రతిసమయంలో నీ హృదయాన్ని పరీక్షించుకో నీ తలంపులలోని ఉద్దేశాన్ని నీవే ప్రశ్నించుకో, ఎందుకంటే నిన్ను నీవే పరీక్షించుకొనకుంటే యితరులు ఆ పని చేయకపోవచ్చు. నీ విషయంలో నీవు కఠినంగా ఉండు. నీ వర్తమానాన్ని మొదటిగా నీకునీవే ప్రకటించుకో. నీవు దాన్ని నేర్చుకొనియుంటే, నీవు దాన్ని యితరులకు ప్రకటింప సిద్ధంగా ఉన్నావు. నీ హృదయంలో అసూయగాని, చేదుతనంగాని లేకుండా తొలగించుకో. నీ వర్తమానం నిన్ను కాపాడుకునేదిగా లేకుండా చూచుకో. అనవసరమైన దృష్టిని నీ మీదికి ఆకర్షించుకోకుండ చూచుకో. దానికి బదులు ప్రభువైన క్రీస్తును పైకెత్తి చూపు.

## ముగింపు

నీ వర్తమానాన్ని నీవు అందించకముందు ఒక కడసారి (వస్తువును) మూలపదార్థాన్ని చేర్చాలి. ఈ విధానమంతటిలో దేవుని నడిపింపును వెదకుతూ పొందుతూ ఉన్నావనుకో. ప్రార్థనతోనే నీవు దాన్ని ప్రారంభించియుండాలి, కాని ప్రార్థనతో నీ వర్తమానానికి స్నానం చేయించే సమయం వచ్చింది. ప్రార్థనలో నీ వర్తమానాన్ని దేవుని యొద్దకు పైకెత్తు, కేవలం నీ మానవ ప్రయాసలు ఆయన సందేశానికి మార్గమైయుండి ఆయన నిన్ను ఉపయోగించుకొనేలా వేడుకో. నిన్నూ, నీ వర్తమానాన్ని దేవునికి అప్పగించుకో. ఆ వర్తమానం ఎక్కడనుండి వచ్చిందో తిరిగి ఆ మూలానికి దాన్ని కొనిపో. అది నీది కాదు, దేవుని వర్తమానమన్న వాస్తవాన్ని గమనించు. ఆయన లేకుండ నీవు శక్తిహీనుడవని ఎరిగి, ఆయన కృపాసనము ఎదుట నిన్నునీవు తగిలించుకో.

ఇప్పుడు, వెళ్లి ప్రసంగించు!

# నీ సందేశాన్ని అందించు

ఇప్పటివరకు నీవు చేసినదంతా, ఈ సమయంకొరకు నిన్ను సిద్ధపరచడానికి సంబంధించిందే, ఇప్పుడు నీవు సందేశాన్ని అందిస్తావ్. గంటను చేసేవాడు అది మ్రోగడాన్ని ఎదురు చూచునట్టు, మరియు పాట వ్రాసేవాడు అది పాడడాన్ని ఎదురు చూచునట్టు, వర్తమానికుడు వర్తమానాన్ని నిర్మించేది దాన్ని అందించాలనే ఎదురుచూపుతోనే. గంట అనేది మ్రోగేవరకు గంటకాదు; పాట అనేది అది పాడే వరకు పాటకాదు; అలారం అనేది శబ్దం చేసేవరకు అది అలారం కాదు; అలాగే వర్తమానం అది అందింపబడేవరకు వర్తమానం కాదు.

సిద్ధపాటులో నీవు పడిన కష్టముయొక్క ఫలితమంతా నీ వర్తమానాన్ని ఎలా అందించావో అనేదే నిర్ణయిస్తుంది. ప్రతి అంచయు ప్రాముఖ్యమైనదే. దేనిని చిన్న చూపు చూడనవసరంలేదు; ఒకదానికంటే మరిదేనికైనా ఎక్కువ ప్రాముఖ్యత యివ్వవలసివస్తే, అది సందేశాన్ని అందించడానికే అయ్యుండాలి. ఇది అన్నిటికంటే పైనున్న మెట్టు, శిఖరాగ్రము, తగ్గిన అంచలయొక్క గురి అదే. పైమెట్టుకు చేరేవరకు గల ప్రతిమెట్టును పునరావలోకనం చేద్దాం:

నీ సందేశాన్ని అందించు
నీ వర్తమానాన్ని జీర్ణం చేసికో
నీ వర్తమానాన్ని ప్రకాశవంతం గావించు
నీ ఆలోచనలను క్రమబద్ధం చేసికో
నీ తలంపును పరిశోధన చేయడం
నీ తలంపును క్రమబద్ధం చేసికొనడం
తలంపును తెచ్చుకొనడం

## అది ప్రదర్శనం యివ్వడంకాదు

ఈ సమయంలో తీసికొనవలసిన అతి ప్రాముఖ్యమైన హెచ్చరిక ఏమంటే – స్టేజిమీద యాక్టర్ వచ్చి తన భాగాన్ని నటించి పోయినట్టు, సందేశం అందించడమనేది ప్రదర్శన మివ్వడం కాదు సుమీ. బహు తరచుగా, వర్తమానాన్ని అందించిన తరువాత, “ఏమి

నెరవేర్చబడింది?" అని విచారించేదానికి బదులు, "నేను ఎలా చేశాను?" అని ప్రసంగీకుడు ఎవరినో ఒకరిని అడగడం కద్దు. దానితో పాటు, మరి తరచుగా, అతడు యిచ్చిన సందేశానికి బదులు మాట్లాడగలిగిన వర్తమానికుని సామర్థ్యాన్ని శ్రోతలు పొగడుతూ ఉంటారు. సువార్తికుని ప్రోత్సాహం అవసరమే, అయినా, అతని సందేశం బాగా అర్థమయ్యింది అనే భావనతో ప్రోత్సహించబడాలేగాని, అతడు బాగా మాట్లాడాడు అని వినడానికి కాదు. Tom Holland అనే ప్రఖ్యాతిగాంచిన అమెరికా సువార్తికుడు మరియు మాట్లాడడాన్ని గూర్చిన ఉపదేశకుడు యిలా అన్నాడు: "తెలివిగలిగి తమాషాగా తర్ఫీదు చేయబడిన స్వరంతో తంత్రంచేయడం సువార్త ప్రకటన కాదు; గాని అది, దేవుని సత్యమనే అగ్నితో నిండుకొనిన నీతిమంతుని పనియైయుంది."

## ప్రసంగించే పద్ధతి

ఆయా ప్రసంగీకులు ప్రసంగించే ఆయా పద్ధతులను ఫలభరితంగా ఉపయోగించారు. కొందరు ఒక పద్ధతితో బాగా చేస్తారు. మరికొందరు యింకో పద్ధతితో బాగా చేస్తారు. కొద్దిమంది మాత్రం చేతిప్రతి పద్ధతిని బాగా ఉపయోగించారు. ఈ పద్ధతితో, సందేశమంతా పూర్తిగా మాటల్లో వ్రాసికొని, ప్రసంగీకుడు మక్కీకి మక్కీగా చదువుతాడు, కొద్దిమంది మాత్రమే ఈ పద్ధతిని ఫలభరితంగా ఉపయోగించారు, ఎందుకంటే నీవు చదువుతూ, నీ చేతి ప్రతికి బోధించుకున్నట్టు కన్పించకుండడం కష్టం.

కొందరైతే జ్ఞాపకం పెట్టుకునే పద్ధతిని బాగా ఉపయోగించారు. ఈ పద్ధతిలో ప్రసంగమంతా మాటకు మాట వ్రాసి, కంఠస్తం చేస్తాడు. కొద్దిమంది మాత్రమే అంత టేలెంటే గలవారైయుండి ఈ పద్ధతిని ఫలభరితం చేశారు. ఆ ప్రసంగీకుడు తానేమి చెప్పనైయున్నాడో దాన్ని జ్ఞాపకం చేసికొనడంలో ఎంతగా నిమఘ్నుడైయుంటాడంటే, తన మాటలను అతడు ఫీలింగ్స్ లేకుండా మాట్లాడేవరకు ఉంటాడు.

ఈ పఠనంలో యివ్వబడిన సిద్ధపాటు యొక్క మెట్లు "అనర్గళంగా మాట్లాడే" గురితో సమీపింపబడ్డాయి. అది పెద్ద మాట. చిన్నగా, అధికమైన చేతి ప్రతితో పెనవేయబడకుండ మాట్లాడడం అని దానికి భావం. ఆలోచించుకున్న నీ పాయింట్సన్నీ వచ్చాయనే నిశ్చయత కొరకు, పూర్ణంగా సిద్ధపరచుకొని వ్రాతలో పెట్టిన చేతి ప్రతిని నీవు సిద్ధపరచుకొని యుండవచ్చును గాని, నీతోకూడా స్పీకర్స్‌స్టాండ్ వద్దకు దానిని తీసికొని వెళ్లవద్దు. వాస్తవంగా నీకు స్పీకర్స్‌స్టాండే అవసరముండదు, నీవు ఈ విధంగా మాట్లాడ తలచుకొంటే సిద్ధపాటులేకుండ, అప్పటికప్పుడే నీవు మాట్లాడుతున్నట్టు అది కన్పిస్తుంది. నీవు నీ అవుట్‌లైన్ను కంఠస్తం చేసియుండవచ్చు లేదా నీ ఆలోచనా క్రమాన్ని "చిత్రించు కొని" యుండవచ్చు, కాని నీ ప్రసంగం యావత్తును నీవు కంఠస్తం చేయలేదు. దానితో నీవు కాలం గడిపావ్. దానిపై వేదనపడ్డావ్, దాన్ని జీర్ణించుకున్నావ్; అయితే ప్రసంగించేవరకు నీ సందేశం యొక్క పదాలు రూపు దిద్దబడలేదు. క్లుప్తంగా "కీలకపు మాటల" అవుట్‌లైన్ నీ బైబిలులో ఉంచుకొని, నీ ఆలోచనా క్రమాన్ని జ్ఞాపకం తెచ్చుకునేలా దాన్ని ఉపయోగించుకోవచ్చు, కాని వర్తమానం అందించే సమయమంతటిలో అటూ యిటూ తిప్పుకొనడానికి కాగితాల కట్టతో నీవు భారం

మోపబడలేదు. ప్రసంగించడం అనేది అనర్గళంగాను, సహజంగాను ఉండి, శ్రోతలలో ఎడతెగని దృష్టి సంధింపుకు అనుకూలంగానే ఉంటుంది.

## కాయపు భాష

నీవు మాట్లాడుతూ ఉండగా, నీ దేహమంతా మరియు నీ ప్రత్యక్షత శ్రోతలకు సందేశాన్ని అందిస్తూంటాయి. వర్తమానం అందించే వాడవుగా భౌతికమైన నీ ఉనికిని శ్రద్ధను యివ్వవలసియుంటుంది.

1. సమకాలిక మర్యాదతో నీటుగా వస్త్రాలు ధరించుకో. వస్త్రధారణలోగాని, తలదువ్వడంలోగాని అనువుకాని దృష్టి నీమీద నిలువకుండేలా జాగ్రత్తపడు.

2. నిటారుగా నిలిచియుండి, నీ వర్తమానాన్ని ఉదహరించడానికి రూపు మార్చు కుంటేతప్ప, రమ్యంగా కన్పించడాన్ని మెయిన్‌టెయిన్ చేయి.

3. నీ శ్రోతలతో దృష్టి సంధింపును మెయిన్‌టెయిన్ చేయాలి. నీవు సీలింగ్‌వైపో, నేలవైపో, లేక శ్రోతల తలలమీదుగానో చూస్తున్నట్టయితే, వారితో కాకుండ నీవు యింకెవరితోనో మాట్లాడుతున్నట్టి భావన వారికి కలుగుతుంది. ముందునుండి వెనుకకు, ఈ ప్రక్కనుండి ఆ ప్రక్కకు నీ కనుదృష్టి ఎడతెగక శ్రోతలను పారజూస్తూనే ఉండాలి. నీవు ఒంటరిగా ఒకనితో చదువుతున్నట్టయితే, నీవు అతనిని, అతడు నిన్ను చూచుకొంటూ ఉంటారు. దృష్టి సంధింపు అనేది నీ వర్తమానాన్ని వ్యక్తిగతం చేస్తుంది.

4. ఉత్సాహకరమయ్యింది నీకు సంభవించితే యింట కూర్చుండి నీ స్నేహితునికి నీవు చెప్పేరీతిలో, సంభాషించే స్టైల్లో ఉపన్యసించు. వ్యక్తపరచుకునే నీ విధానం స్వర కదలికలు, సంజ్ఞలు, వగైరాలన్నీ నీ భావాన్నే వ్యక్తం చేస్తూ ఉంటాయి. నీవు ఎలా మాట్లాడుతున్నావు, ఎలా సంజ్ఞలు చేస్తున్నావనేవాటి మీద నీవు నీ దృష్టిని నిలపడం లేదు, కాని నీవు ఏమి మాట్లాడుతున్నావో దానిమీదనే నీవు దాన్ని నిలుపుతున్నావు. స్వర కదలికలు, సంజ్ఞలు సహజంగానే ఉన్నాయ్. శ్రోతలముందు అందరికి వినిపించేలా నీ స్వరాన్ని పెంచవచ్చు, కాని సంభాషణా గాత్రాన్నే యింకా మెయిన్‌టెయిన్ చేయాలి. మరియొకనిలా వినిపించడానికి ప్రయత్నించకు.

అంశాన్ని గూర్చిన విషయమే "సంభాషణా ధోరణి," ఎలాటిదో నిర్ణయించవచ్చు. ఒక తోటను ఎలా నాటాలో నీవు చెప్పేటప్పుడు ఉపయోగించే స్వరానికిని, రాత్రివేళ నీ పొరుగువాని యిల్లు కాలుతుందని చెప్పేటప్పుడు ఉపయోగించే స్వరానికి తేడావుంటుంది. ఓ వీధి మూలలో నిలిచి నీ పొరుగువాని యిల్లు కాలిపోతుందని నీవు చెప్పుతున్నట్టు ఊహించు. వారిని మేల్కొల్పడానికి నీవు వారి తలుపులను కొట్టి, పొగతో నిండిన వారి యింటిలోనికి జొచ్చి, వారందరిని వెలుపలికి రప్పించడానికి వారికి సహాయపడినట్టు నీవు చెప్పుతూ ఉండగా, నీ కథను వినడానికి యింకా యితరులు పోగయ్యారు. గుంపు ఎక్కువయ్యేకొద్ది నీ స్వరం మెల్లగా పెదుగుతునే ఉంటుంది. సంజ్ఞలు ఎక్కువ తేటగా కన్పిస్తాయి. నీవు అలా ఎందుకు చేస్తున్నావో కనీసం ఆలోచించవు, గుంపుకు సమాచారం అందించే డైనమిక్స్‌కు అది కేవలం సహజమైన బదులైయుంటుంది. అయినా, మరొక విధమైన స్పీకింగ్ స్టైలుకు లేదా "ప్రీచర్ టోనుకు"

నీవు సడన్‌గా మార్చవు.

ఇప్పుడు, అదే వీధి మూలలో నిలిచి ఒక తోటను ఎలా నాటాలో నీ స్నేహితునికి వివరిస్తున్నావనుకో, అప్పుడు నీ స్వరము, సంజ్ఞలు ఎంత వ్యత్యాసంగా ఉంటాయో ఊహించు, మరల, తోటను నాటడానికి ఆసక్తి గలవారు అక్కడ ఆగి ఆలకించుతున్నప్పుడు, నీ స్వరం యొక్క వాల్యూమ్‌లోను, సంజ్ఞలలోను మార్పులు జరుగుతాయ్. ఇంతకు ముందటిదానివలె నీవు ఆసక్తిని కనుపరచినా, దానిలో ఉండే ఉద్రేకము కొంచెం తగ్గుతోంది. నీవు సహజంగాను, సంభాషించినట్టుగాను ఉంటావు. శ్రోతలకు నీవు వర్తమానాన్ని అందించేటప్పుడు నీవు అదే విధంగా ఉండాలి.

5. ఉత్సాహముతోను, ఉద్వేగంతోను మాట్లాడు. ఏ విధమైన ఉద్వేగము, ఉత్సాహము నీ శ్రోతలు ఫీల్ అవ్వాలని నీవు కోరతావో అలాగే నీవు ఫీల్ అవ్వాలి. తన యిల్లుకాలి పోతుందని ఒక మనిషికి నీవు ఎలా చెప్తుతావు? ప్రాముఖ్యత, అర్జెన్సీ అనే భావంతో నీవు అతనికి చెప్పవా? "చావు – బ్రతుకులు" అనే (అర్జెన్సీతో) అతివేగపు అవసరతతో, నీవు అలా చేస్తున్నట్టు గ్రహించకుండానే, దాదాపు నీవు ఆ సందేశాన్ని అందించియుండవచ్చు. నీవు నీ స్వభావసిద్ధమైన ఫీలింగ్సను వ్యక్తపర్చుతావు, తక్షణమే అతడుకూడా అలాగే ఫీలౌతాడు. వాస్తవంగా, అది అతని యిల్లు గనుక, అతడు నీ కంటే మరి ఎక్కువైన ఉద్రిక్తతతో ఫీల్ అవ్వవచ్చు.

లోకంలోని ప్రతివ్యక్తి దేవుని వాక్యము వినవలసిన అవసరముంది. అది వారికి నిత్యజీవ మరణాలకు సంబంధించింది. ప్రభువైన యేసు క్రీస్తుకు "అవును" లేక "కాదు" అని చెప్పే అవకాశానికి పాత్రుడై ప్రతి స్త్రీ పురుషుడు ఉంటాడు. భూమిమీద అది అత్యంతవేగపు అవసరమైయుంది. అలాటి చావు – బ్రతుకుకు సంబంధించిన కథను ఉత్సాహపూరితుడవు కాకుండ ఒకనికి ఎలా చెప్తుతావో?

## ముగింపు

ఈ పాఠాన్ని, ఈ పఠనాన్ని మనం సంపూర్తి చేస్తూ ఉండగా, దైవసందేశాన్ని అందించే వర్తమానికునికి తగినట్టి గుణగణాలను సూచించే స్వభావలక్షణాలను, కలిగించే తలంపులను మరొకసారి లెక్కించుదాం.

1. దేవుని ఆనందింపజేయడానికి నీ సందేశాన్ని అందించు. ఇతరుల యొక్క మన్ననలను పొందగోరి నటనచేయడమో లేక వారికి అనుకూలంగా మాటలాడాలని శోధింపబడడమో అనే వాటి విషయం జాగ్రత్తగా ఉండాలి. తన చుట్టునున్న జనులను సంతోషపెట్టుటకాక, దేవుని సంతోషపెట్టుటయే తన గురియని పౌలు గలతీ ప్రాంతపు క్రైస్తవులకు తేటపరచాడు (గలతీ. 1:9–11). తన కోర్కె తన తండ్రిని ఆనందింపజేయడమే అనే విషయంపై ప్రభువైన యేసు ఏ సందేహాన్ని మిగల్చలేదు (యోహాను 4:34; 6:38; 8:29).

2. సిలువను ప్రదర్శించునట్లు నీ వర్తమానాన్ని అందించు. "సిలువవేయబడిన యేసు క్రీస్తును తప్ప" మరిదేనిని ఎరుగకుందునని పౌలువలే నిశ్చయించుకో (1 కొరింథీ. 2:2).

3. దీనమనస్సు కలిగియుండు. "తన్నుతాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును;

తన్నుతాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును" అని ప్రభువైన యేసు చెప్పిన మాటలను జ్ఞాపకం చేసికో (మత్తయి 23:12).

4. నిష్కపటముగా ఉండు. దేవుని ప్రజలకు యెహోషువ యిచ్చిన వీడ్కోలు సందేశం సువార్తికులకు, ఉపదేశకులకు మంచి సలహానిస్తుంది. "కాబట్టి మీరు యెహోవాయందు భయభక్తులుగలవారై, ఆయనను నిష్కపటముగాను సత్యముగాను సేవించుడి" (యెహోషువ 24:14).

5. నీవు ఏ ఘనతను తీసికొనక, దేవుని మహిమపరచు. వర్తమానం లేకుండ నీవు వర్తమానికుడవై యుండలేవుగదా? వర్తమానం దేవునిది. సమస్త మహిమ ఘనత ఆయనదే, అది ఆయనకే చెందాలి. "సకల యుగములలో రాజైయుండి, అక్షయుడును అదృశ్యుడునగు అద్వితీయ దేవునికి ఘనతయు మహిమయు యుగయుగములు కలుగును గాక. ఆమెన్" (1 తిమోతి 1:17).

## ట్రూత్ ఫర్ టుడే నీవు పొందుతున్నట్టయితే మేము తెలిసికోవాలి!

ఈ మెటీరియల్స్‌ను నీకు పంపించడానికి మేము సంతోషిస్తాం, అయితే ఫైల్‌లో ఉంచడానికి వ్రాత పూర్వకమైన కొంత సమాచారం మాకు కావాలి. ఇటీవల నెలలలో మీలో అనేకులు మాకు వ్రాశారు, కాని ఈ మెటీరియల్స్ ప్రింటెడ్ ప్రీచర్ స్కూలు ప్రతి విద్యార్థి పొందుతున్నట్టు మేము రూఢిగా తెలిసికోవాలి. కనీసం పన్నెండు నెలలలో ఒక్కసారైనా దయతో మాకు వ్రాయండి. మరియు ఈ క్రింది ప్రశ్నలకు జవాబు లివ్వండి:

- ప్రతి సంవత్సరం 6 పాకేజీల మెటీరియల్స్ మీకు అందుతుందా?
- సరియైన చిరునామాకే మెటీరియల్స్ పంప బడుతున్నాయా?
- ప్రసంగించడంలోను ఉపదేశించడంలోను మెటీరియల్స్ ఉపయోగించ బడుతున్నాయా?

ఈ విషయంలో మీ సహకారానికి వందనములు. మీరు ఈ క్రింది చిరునామాకు మాకు వ్రాయండి: Truth for Today, 2209 S. Benton, Searcy, AR. 72143, USA.

# భూస్థాపనకు సంబంధించిన ఆలోచన :

# "మరణము చేయలేనిది"

మరణము సర్వశక్తియైయున్నట్టు తరచుగా భావించబడుతుంది. వాస్తవంగా, మరణానికి గొప్పశక్తి ఉంది. అది నరునికంటే బలమైనది. వైద్య విజ్ఞానముకంటె అది బలమైనది.

అయినా, మరణం దేవునికంటెను ఆయన వాక్యముకంటెను బలమైనది కాదు. మరణము యొక్క పరిమితులను ఆలోచించడం ఆదరణగా ఉంటుంది. క్రీస్తునందు మనకున్న రమ్యమైన దీవెనలు మరణంచేత లయపరచబడవు.

**I. మరణం మన ఆత్మలపై పనిచేయనేరదు.**

A. "మరణమా, నీ ముల్లెక్కడ?" అని క్రైస్తవుడు మరణాన్ని గూర్చి చెప్పవచ్చు (1 కొరింథీ. 15:55).

B. మరణం మన దేహాలను తాకవచ్చు, కాని దాని చల్లని వ్రేళ్లను మన ఆత్మలపై పెట్టలేదు (ఫిలిప్పీ. 1:23, 24; యోహాను 8:51; 11:25).

**II. మరణము మన దేహాలను ఉంచుకోలేదు.**

A. మరణం యొక్క స్వాధీనంలో దేహము నిరంతరం ఉండదు (1 కొరింథీ. 15:35–50).

B. దేహములపై మరణ విజయం కేవలం తాత్కాలిక మయ్యిందే (ఫిలిప్పీ. 3:21).

**III. మరణము మన పలుకుబడిని లయపరచలేదు.**

A. తన వెనుక క్రైస్తవుడు సత్క్రియల సారను విడిచివెళ్లతాడు (తీతు 3:1).

B. ఈ సత్క్రియలు అతనివెంట వెళ్లతాయి (ప్రకటన 14:13).

**IV. మరణము మన సహవాసాన్ని తొలిగించలేదు.**

A. మరణంనొద్ద క్రైస్తవుడు గొప్పదైన, ఉన్నతమైన సహవాసంలోనికి ప్రవేశిస్తాడు (ఫిలిప్పీ. 1:21–24).

B. వేరే లోకంలో మరోవైపు ఉన్న సంఘ సహవాసాన్ని అతడు అనుభవిస్తాడు.

## ముగింపు

గనుక, మరణంకంటే బలవంతుడైన దేవుని మనం ఆశ్రయించాలి. సువార్త ప్రక్కన నిలిపితే మరణం బలహీనంగా కన్పిస్తుంది: ప్రభువైనయేసు మరణబలమును లయపరచాడు.

డాక్టర్. ఎడ్డీ క్లోయర్